# ధర్మఘంటి

జాతీయ తెలుగు దినపత్రిక

TELTEL/2012/47103

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 223 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | మంగళవారం 11 నవంబర్ 2025 | పేజీలు : 8 | వెల : 1

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


### 875 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం దిశగా సాగుతున్నాం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 875 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించే దిశగా సాగుతున్నామని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) సనోజ్ కుమార్ ఝా తెలిపారు. గత 2 నెలల్లో కోల్ ఇండియా ఉత్పత్తి లక్ష్యాన్ని చేరని నేపథ్యంలో.. హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ 59వ వ్యవస్థాపక దినోత్సవంలో సనోజ్ ఇలా పేర్కొనడం

### ఒలెక్ట్రాకు రూ.49.5 కోట్ల లాభాలు

ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఓజీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 4.2 శాతం వృద్ధితో రూ.49.5 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.47.6 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2025-26 క్యూ2 ఫలితాలకు ఆ కంపెనీ బోర్డు శనివారం ఆమోదం తెలిపింది.



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్‌కు
# సర్వం సిద్ధం

- ఉదయం ప్రారంభం కానున్న పోలింగ్
- పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్
- డ్రోన్ల ద్వారా సెక్యూరిటీ మానిటరింగ్ చేస్తామన్న కర్ణన్

జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం ప్రారంభం కానున్న పోలింగ్ కోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. యూసఫ్‌గూడలోని డీఆర్సీ సెంటర్‌లో ఈసీ అధికారులు సిబ్బందికి ఈవీఎంలను, పోలింగ్ స్టేషన్లను కేటాయించారు. ఎన్నికల సిబ్బంది సాయంత్రం లోగా పోలింగ్ స్టేషన్లకు చేరుకుంటారు. జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈసారి డ్రోన్ల ద్వారా సెక్యూరిటీ మానిటరింగ్ ఉంటుందని కర్ణన్ తెలిపారు. ప్రతి అభ్యర్థికి ఒక్కో పోలింగ్ ఏజెంట్ పాస్‌ను అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

## 3 పార్టీలకు
# టెన్షన్




- భారీగా రంగంలోకి బెట్టింగ్ రాయుళ్లు
- జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నిక ఆసక్తిని కలిగిస్తోంది
- తెలంగాణ మాత్రమే కాదు ఏపీ ప్రజలు కూడా ఈ ఎన్నికను ప్రత్యేకంగా చూస్తున్నారు.
- ఏ పార్టీ ఎలాంటి హామీలు ఇచ్చింది?
- క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉంది?
- అనే అంశాల మీద తెలంగాణ వారి కంటే, ఏపీ ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నిక ఆసక్తిని కలిగిస్తోంది. తెలంగాణ మాత్రమే కాదు ఏపీ ప్రజలు కూడా ఈ ఎన్నికను ప్రత్యేకంగా చూస్తున్నారు. ఎందుకంటే ఈ నియోజకవర్గంలో ఏపీ నుంచి వచ్చిన వారు అధికంగా ఉన్నారు.. అందువల్లే ఎవరు గెలుస్తారు? ఎవరికి ఎక్కువ ఓట్లు పడతాయి? ఏ పార్టీ ఎలాంటి హామీలు ఇచ్చింది? క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉంది? అనే అంశాల మీద తెలంగాణ వారి కంటే, ఏపీ ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.ఏపీ నుంచి చాలామంది ఇప్పటికే జూబ్లీహిల్స్ ప్రాంతానికి వచ్చారు. అలాగని వారు సర్వే సంస్థలలో - మిగతా3లో

## తెలంగాణ స్పీకర్‌పై సుప్రీంకోర్టులో
# కోర్టుధిక్కార పిటిషన్



- ఎమ్మెల్యేల ఫిరాయింపులపై చర్యలు తీసుకోలేదని ఆరోపణ
- అత్యవసర విచారణ జరపాలని కోరిన బీఆర్ఎస్ న్యాయవాది
- విచారణకు మరింత గడువు కోరిన స్పీకర్ కార్యాలయం

హైదరాబాద్

తెలంగాణ రాజకీయాలు మరోసారి సుప్రీంకోర్టుకు చేరాయి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంలో జాప్యం చేస్తున్నారంటూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టులో ధిక్కార పిటిషన్‌ను దాఖలు చేసింది. గతంలో అత్యున్నత న్యాయస్థానం నిర్దేశించిన మూడు నెలల గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని, ఇది కోర్టు ఆదేశాలను ధిక్కరించడమేనని పిటిషన్‌లో పేర్కొంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరఫున ఈ పిటిషన్ దాఖలైంది. మరోవైపు, ఎమ్మెల్యేలపై విచారణకు సంబంధించి తమకు మరింత గడువు - మిగతా3లో



## భారత్ చుట్టూ ఉగ్రవాద విస్తరణకు పాక్ కుట్ర

- సరిహద్దులకు కొన్నికిలోమీటర్ల దూరంలో ఉగ్రస్థావరాల ఏర్పాటుకు సన్నాహాలు
- ఆపరేషన్ సిందూర్ తర్వాత వేగవంతమైన కార్యకలాపాలు
- సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను పెంచిన నిఘా వర్గాలు

## కాంగ్రెస్‌కు జూబ్లీహిల్స్
# ఓటర్లు బుద్ధి చెబుతారు

- రేవంత్ రెడ్డి ఎన్ని డ్రామాలు ఆడినా..
- జూబ్లీహిల్స్ ఓటర్లు ఎవరికి ఓటేయాలో ముందే నిర్ణయించుకున్నారు
- కాంగ్రెస్ పార్టీ మద్యం, డబ్బును విచ్చలవిడిగా పంపిణీ చేస్తోంది
- లక్షకు పైగా చీరలు, మిక్సీలను ఓటర్లకు ఎరగా వేస్తోంది
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు చేసినట్లు వెల్లడి



హైదరాబాద్


జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇష్టారాజ్యంగా మద్యాన్ని ప్రవహింపజేస్తూ, విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. లక్షకు పైగా చీరలు, మిక్సీ గ్రైండర్లను పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. వీటన్నింటికీ సంబంధించిన ఫొటోలు, వీడియో ఆధారాలను ఎలక్షన్ కమిషన్‌కు సమర్పించామని తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కోరామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించి డబ్బులు పంపిణీ చేయడంపై హైదరాబాద్ బీఆర్కే భవన్‌లో సీఈవో సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. కొంతమంది పోలీసులు, ఇతర అధికారులు - మిగతా3లో



## కర్ణాటకలో సీఎం మార్పు?

- సిద్ధరామయ్యకు అపాయింట్‌మెంట్ ఇవ్వని కాంగ్రెస్ అధిష్ఠానం!
- కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై జోరుగా ప్రచారం
- కాంగ్రెస్ పెద్దలతో సమావేశమయ్యేందుకు సమయం కోరిన సిద్ధరామయ్య
- ఆ సమావేశం అవసరం లేదన్న కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం

## ప్రజా కవి అందెశ్రీ
# అస్తమయం



- రేబర్తిలో అలుముకున్న విషాద ఛాయలు
- 'జయ జయహే తెలంగాణ' గీత రచయిత అందెశ్రీ ఇకలేరు
- హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- ఆయన రాసిన 'జయ జయహే తెలంగాణ'కు రాష్ట్ర గీతంగా గుర్తింపు
- తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో కీలక పాత్ర పోషించిన అందెశ్రీ
- పాఠశాల విద్య లేకుండానే కవిగా గొప్ప పేరు సాధించిన వైనం
- 'మాయమైపోతున్నడమ్మా' పాటతో విస్తృత ప్రజాదరణ
- అందెశ్రీకి ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు... సీఎం రేవంత్ ఆదేశాలు
- అందెశ్రీ మృతిపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలని ఆదేశం

మద్దూరు (ధూళిమిట్ట )

తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రజా కవి, గాయకుడు డాక్టర్ అందెశ్రీ గుండెపోటుతో సికింద్రాబాద్ గాంధీ దవాఖానాలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అందెశ్రీ((64)) మృతితో ఆయన స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో విషాద ఛాయలు - మిగతా3లో

## బీహార్‌లో రెండో దశ పోలింగ్‌కు సర్వం సిద్ధం

- భద్రత కట్టుదిట్టం
- మొదటి దశలో 121 స్థానాల్లో పోలింగ్
- మిగిలిన 122 స్థానాలకు రెండో దశలో పోలింగ్
- పోలింగ్ నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు
- మొత్తం 4 లక్షల మంది పోలీసులు, పారా మిలిటరీ బలగాలు




# సంపాదకీయం

## అమెరికాలో షట్‌డౌన్ కార్పొరేట్ ప్రయోజనాలు

ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తి అయిన అమెరికాలో, ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేని విధంగా ఒక వింత సమస్య తరచుగా తలెత్తుతున్నది. అదే ప్రభుత్వ కార్యకలాపాల నిలుపుదల లేదా షట్ డౌన్. ఇలా ఎందుకు జరుగుతున్నది? అమెరికాలో ప్రభుత్వ కార్యకలాపాలు సజావుగా సాగాలంటే అవసరమైన ఖర్చు పెట్టడానికి అక్కడి పార్లమెంటు చట్టపరమైన అనుమతి కావాలి. దేశం అప్పుల పాలు కాకుండా ప్రభుత్వ దుబారా ఖర్చులను నిరోధించేందుకు 1870వ సంవత్సరంలో యాంటీ డెఫిషియన్సీ చట్టం (ఏడీఏ)ద్వారా ఈ విధానం ప్రవేశపెట్టారు. ఫెడరల్ ప్రభుత్వ కార్యకలాపాలకు నిధులందించేందుకు పార్లమెంట్ తప్పనిసరిగా ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే బడ్జెట్ ఆమోదించాలి. అందులో విఫలమైతే, దేశంలోని పలు విభాగాల సేవలు మూసివేయబడతాయి. దీనినే ప్రభుత్వ షట్ డౌన్ అంటారు. వందమంది సభ్యులున్న సెనేట్‌లో మెజారిటీకి అవసరమైన అరవై ఓట్లు పొందలేని కారణంగా ఈ బిల్లు ఆమోదం పొందలేకపోయింది. దీంతో పాటు ఆమోదం పొందాల్సిన రిపబ్లికన్ ఫండింగ్ బిల్లుకూడా వీగిపోయింది. అందువలన అక్టోబర్ ఒకటి 2015 నుండి అమెరికాలో షట్ డౌన్ మొదలైంది. అధికార రిపబ్లికన్ పార్టీ (డోనాల్డ్ ట్రంప్), ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ సంక్షోభానికి దారితీసింది. ఆరోగ్య సంరక్షణ నిధులు కొనసాగించాలని, వలస విధానాలు వంటి కీలక రాజకీయ డిమాండ్లను నిధుల బిల్లుకు జతచేయాలని డెమొక్రాట్లు డిమాండ్. డెమొక్రాట్ల పాలనలో రాష్ట్రాలకు కేటాయించిన అభివృద్ధి నిధులను నిలిపివేయడం, అలాగే ప్రభుత్వ ఉద్యోగుల్లో తనకు వ్యతిరేకంగా ఉన్న వారిని తొలగిస్తానని బహిరంగంగా ట్రంప్ బెదిరించడం ఈ షట్‌డౌన్‌కి ప్రధాన కారణాలుగా మీడియా, పరిశీలకులు చెబుతున్న విషయాలు. పాలకవర్గాలకు దేశ ప్రజలకంటే కార్పొరేట్ ప్రయోజనాలే ప్రధానంగా తెరమీదకి రావడంతో షట్‌డౌన్ దుస్థితి పదే పదే దాపురిస్తున్నది. అమెరికాలోని రెండు ప్రధాన పాలకవర్గ పార్టీలైన రిపబ్లిక్, డెమొక్రాట్ పార్టీలు రెండు పైకి నినాదాలు ఏమిచ్చినప్పటికీ ఆచరణలో కార్పొ రట్ ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తున్నాయడంలో సందేహం లేదు. షట్‌డౌన్ కారణంగా లక్షలాది మంది ఉద్యోగులు, కార్మికులు జీతంలేని బలవంతపు సెలవులకు నెట్టివేయబడుతున్నారు. షట్ డౌన్ ఎత్తివేసిన తర్వాత వారిలో కొందరికి కొంతమేర జీతాలిచ్చే అవకాశం ఉంది. కానీ అనేక డిపార్ట్‌మెం ట్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తిరిగి విధుల్లోకి తీసుకోబడినప్పటికీ షట్‌డౌన్ కాలంగా కోల్పోయిన వేతనాలు మాత్రం తిరిగి పొందడం లేదు. ఇది అడ్మినిస్ట్రేటివ్ డిఫాల్ట్ కాదు, వర్గ ప్రయోజనాల రాజకీయ కారణంగా జరిగింది. బడ్జెట్ ఆమోదించకపోవడం అనేది కార్పొరేట్ల కనుసన్నల్లో నడిచే పార్టీలకు వారి రాజకీయ కోర్కెలు తీర్చుకునే ఆయుధంగా మారింది. ఎవరు అధికారంలో ఉన్న తరచూ ఈ ఆయుధం ప్రయోగిస్తూనే ఉండటం వల్ల అనేకసార్లు ఇలాంటి షట్‌డౌన్ సంక్షోభాలు తలెత్తాయి. ట్రంప్ హయాం లో అది మరింత ప్రమాదకరంగా మారింది. అందువల్ల నేడు అమెరికాలో నేషనల్ సెక్యూరిటీ, పబ్లిక్ సేఫ్టీ, ప్రొటెక్షన్ ఆఫ్ ప్రాపర్టీ ఇబ్బందిగా మారింది. అమెరికాలో 65 నుండి 75శాతం ఉద్యోగులు, కార్మికులు ఈ నెల జీతం అయిపోయి మరుసటి నెల జీతం కోసం ఎదురు చూస్తూ జీవిస్తారు.అందువల్ల ఇంటి అద్దెలు, కరెంటు, వాటర్, గ్యాస్, నిత్యావసర సరుకులు, విద్య, వైద్యం లాంటి యుటిలిటీ బిల్స్ చెల్లించలేని స్థితికి చేరుకున్నారు. అనేకమంది ఎసెన్ని యల్ వర్కర్స్ యొక్క ఉద్యోగాలు పోవడం వల్ల వారి కుటుంబాలకు తిండి పెట్టలేక ఫుడ్ బ్యాంకులకు తరలించాల్సిన దారుణమైన పరిస్థితి వచ్చింది. అలాగే స్కిల్డ్ ప్రొఫెషనల్ కూడా రీతీఅరశీఅ స్త్రబ%ఖ%తీసర గాను, ఉబర్ డ్రైవర్స్ గాను, లిఫ్ట్ ఆపరేటర్స్‌గాను పనిచేయాల్సి వస్తున్నది. సకాలంలో ఈఎంఐలు చెల్లించ లేకపోవడం వలన వారి సిబిల్ స్కోర్‌లు పడిపోయాయి. అలాగే రోజువారి అవసరాలకు క్రెడిట్ కార్డులు వాడి సకాలంలో ఆయా మొత్తాలను చెల్లించకపోవడం వలన, వాటిపై వడ్డీల భారం పెరిగి అప్పు మరింత పెరిగిపోతున్నది. ఉద్యోగాలు లేక జీతాలు లేక కొనుగోలు శక్తి తగ్గటం వలన అనేక పలు వ్యాపారాలు మూతపడ్డాయి. అందువలన కాఫీ షాపులలో, ఐటీ సంస్థలలో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులు, అలబామా, హంట్ విల్లే ప్రాంతాలలో నివసించే వ్యవసాయ పరిశోధకులు, ఓహాయోలో ఉండే విఏ నర్సులు, కాలి ఫోర్నియాలో ఉండే ఫారెస్ట్ ఫైర్ ఫైటర్స్, టెక్సాస్‌లో ఉండే బోర్డర్ ఏజెంట్స్ లాంటి అసంఘటిత రంగ కార్మికులు ఉద్యోగాలు, జీతాలు కోల్పోయారు. అంతేగాకుండా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ (ఏటిసి), ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ (టిఎస్ఎ)లలో జీతం లేకుండా పనిచేయాల్సి రావడం వలన వారిలో తీవ్ర ఒత్తిడి పెరిగింది. ఈ రంగాల్లో ఔట్‌సోర్సింగ్ స్టాఫ్‌ను తీసివేయడం వల్ల ఎయిర్ ట్రాఫిక్ జామ్స్ ఏర్పడుతున్నాయి. లాస్‌ఏంజిల్స్ లాంటి ముఖ్యమైన చోట టర్మినల్స్ మూసివేశారు. ఇలా ఉద్యోగాలు కోల్పోయిన వారు నేడు అమెరికాలో 14లక్షల వరకు ఉంటారు. వీరందరూ వాషింగ్టన్ డిసి లాంటి మెట్రోపాలిటన్ సిటీలలో 15శాతం నివసిస్తుండగా మిగతా 85శాతం వివిధ రాష్ట్రాలు, టెరిటరీలలో ఉంటున్నారు. అందువలన ఇది ప్రాంతీయ సమస్య కాదు. మొత్తం అమెరికా దేశ సమస్యగా మారింది. అంతేగాకుండా షట్ డౌన్ వల్ల ప్రభుత్వ (ఎస్ఎన్ఏపి) సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెంట్ ప్రోగ్రాంకి నిధులు సమకూర్చడం ఆపివేసింది. ఈ పథకం ద్వారా 42 లక్షల పేద ప్రజలకు అమెరికా ఫుడ్ అందిస్తూ ఆదుకుంటున్నది. ఇది దేశ జనాభాలో పది శాతం. దీనివల్ల పిల్లలు, పేదలు, ముసలివారే ఎనభై శాతం ప్రయోజనం పొందుతున్నారు. ఎస్ఎన్ఎపి పథకం ఆగిపోవడం వలన అగ్రికల్చరల్ వస్తువుల అమ్మకం దెబ్బతిన్నది. ఈ పథకం అనేది ఈబీటి (ఎలక్ట్రానిక్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) కార్డు ద్వారా బదిలీ చేయబడి పేదలకు ఆసరాగా ఉండేది. ఇలా ఫెడరల్ ప్రభుత్వ ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోయి జీతాలు లేక, పేదల ఎస్ఎన్ఏపీ పథకం ఆగిపోవడం వలన ప్రజలు డబ్బు ఖర్చు చేయలేని స్థితికి వచ్చారు. అందువల్ల రెస్టారెంట్లు, కాఫీ షాపులు, చిన్నచిన్న రిటైలర్స్, ప్రభుత్వ ఆఫీసులు, మిలటరీ బేసిన్‌లలో కస్టమర్స్ పూర్తిగా తగ్గిపోయారు. ఇది స్థానిక ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థపై పడింది. ఈషట్‌డౌన్ అమెరికా ఆర్థిక వ్యవస్థని చిన్నాభిన్నం చేసింది. దేశానికి ఊహించని నష్టాన్ని తెచ్చింది. ఇక్కడి ఆర్థిక అనిశ్చితి వల్ల ప్రపంచ స్టాక్ మార్కెట్లు, విదేశీ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా తన దేశ బడ్జెట్ ఆమోదింప చేసుకోలేక పోవడం, ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడుదారుల విశ్వాసాన్ని దెబ్బతీ స్తున్నది. ఇది ప్రపంచ పెట్టుబడుల ప్రవాహాన్ని తగ్గిస్తుంది. అంతేకాక అనేక కీలకాంశాల సమాచారాన్ని సేకరించే సంస్థల కార్యకలాపాలు ఆగిపోయాయి. ఈ సమాచారం లేకపోవడం వల్ల ప్రపంచ బ్యాంకులతో సహా అంతర్జాతీయ సంస్థలు, ఫెడరల్ రిజర్వ్ వంటివి సరైన నిర్ణయాలు తీసుకోలేవు. షట్‌డౌన్ ఎక్కువకాలం కొనసాగితే అమెరికన్ కంపెనీలు ఖర్చులను తగ్గించుకుం టాయి. దీనివల్ల మన దేశ ఐటీ సేవల ఎగుమతులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా అంతర్జాతీయ మార్కెట్లో అనిశ్చితి పెరిగి భారత స్టాక్ మార్కెట్లు నష్టపోవడం, రూపాయి విలువ తగ్గడం వంటి ఆర్థిక ఇబ్బందులు ఎదురు కావచ్చు. షట్‌డౌన్ ఎక్కువకాలం కొనసాగితే అమెరికా అభివృద్ధి మందగించడంతో, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం ఏర్పడుతుంది. అంతర్జాతీయ సహాయ కార్యక్రమాలు, వీసా ప్రక్రియలు వంటివి ఆగిపోవడం వల్ల విదేశీ సంబంధాలు దెబ్బతింటాయి. మిక్కిలి బాధాకరమైన ప్రభావం హెచ్1బి వీసా, గ్రీన్ కార్డ్ ప్రక్రియలో ఏర్పడిన అంతరాయం. నిధుల కొరత కారణంగా యుఎస్ కార్మికశాఖలోని ఫారెన్ లేబర్ సర్టిఫికేషన్ కార్యాలయం అన్ని కార్యకలాపాలను నిలిపివేయ డంతో, కొత్త హెచ్1బి వీసా పిటిషన్‌లు దాఖలు చేయడానికి లేదా ఉద్యోగాన్ని మార్చడానికి అవసర మైన ముందుగా లేబర్ కండిషన్ అప్లికేషన్ పై డీవోయల్ ధ్రువీకరణను పొందలేకపోతున్నారు. అందువలన హెచ్1బి వీసాల ద్వారా అత్యధికంగా లబ్ధి పొందుతున్న నైపుణ్యం గల భారతీయులు వేలాదిమంది అనిస్థితిలో చిక్కుకున్నారు. వారి ఉద్యోగ మార్పిడిలు కొత్త నియామకాలు నిరవధికంగా ఆగిపోయాయి. అదే విధంగా శాశ్వత నివాసానికి అవసరమయ్యే గ్రీన్ కార్డ్ దరఖాస్తుల ప్రక్రియ కూడా స్తంభించింది. మరి దీనికి పరిష్కార మేమిటి? షట్ డౌన్ వర్గ రాజకీయ విభేదాల


# మాడపాటి జీవితమే ఆంధ్ర ఉద్యమ చరిత్ర



మాడపాటి హనుమంతరావు ఒక వ్యక్తి కాదు. ఒక మహాసంస్థ. ఆయన జీవిత చరిత్రమే తెలంగాణ ఆంధ్రోద్యమ చరిత్ర. అందుకే ఆంధ్ర పితామహుడని పేరుపొందిన ప్రజానాయకుడు ఆయన. నాటి నిజాం రాజ్యంలోని తెలుగు వారిలో జాగృతిని కలిగించి, సామాజిక, సాంస్కృతిక రాజకీయ వికాసానికై నిరంతర కృషిచేసిన ప్రముఖుడు, బహుభాషా పండితుడు మాడ పాటి. తెలంగాణలో చైతన్యాన్ని తెచ్చిన తొలి తెలుగు నాయకునిగా ఆయన సుపరిచితుడు. ఆయన ఒక విజ్ఞాన సర్వస్వము. ఆయన బ్రిటీష్, నిజాం రాజ్యాల సరిహద్దు లలో ఉన్న ఎర్రుపాలెం వాస్తవ్యుడు కనుక నిజాం ఆంధ్రులందరిలో ముందు మేల్కొన్నాడు. తన దేశీయుల్ని మేల్కొలిపినాడు. 1904లో హనుమకొండలో శ్రీరాజరాజ నరేంద్ర ఆంధ్రభాషా నిలయంలో సన్నని జాలుగా బయలుదేరిన ఆయన ఆంధ్రో ద్యమం గోల్కొండ పత్రికలో పరిపుష్టినందుకుని, ఆంధ్రమహా సభలలో వాహినిగా ప్రవహించింది. హనుమంతరావు 20వ శతాబ్ది తొలిదశకంలో హైదరాబాద్ రాజ్యంలోని తెలుగు ప్రాంతాల్లో (నేటి తెలంగాణ) ఆంధ్రోద్యమం వ్యాప్తి చేసేందుకు కృషిచేశారు. న్యాయవాద వృత్తిని చేపట్టిన మాడపాటి, విజయవంతమైన లాయరుగా పేరుపొందారు. తీరిక సమయాలన్నిటా ఆంధ్రోద్యమానికి, తెలంగాణాలో గ్రంథాలయాల అభివృద్ధికి కేటాయించేవారు. ఆంధ్ర జన సంఘం, ఆంధ్ర మహాసభ వంటి ప్రజాసంఘాల స్థాపనలోనూ, వాటి నిర్వహణలోనూ కీలకపాత్ర వహించారు. 1885 జనవరి 22 (తారణ సంవత్సర మాఖ శుద్ధ షష్ఠి) న కృష్ణా జిల్లా, నందిగామ తాలూకా పొక్కునూరులో వెంకటప్పయ్య, వెంకట సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. వీరు ఆరువేల నియోగి బ్రాహ్మణులు. ఆయన తండ్రి గ్రామాధికారిగా పనిచేసేవాడు. ఐదు సంవత్సరాల వయసులోనే తండ్రి చనిపోగా, సూర్యాపేటలో ఉద్యోగం చేస్తున్న మేనమామ దగ్గర పెరిగారు. హన్మకొండలోని ఉన్నత పాఠశాలలో చేరి మద్రాసు యూనివర్సిటీ మెట్రిక్యులేషన్ పరీక్ష ఉత్తీర్ణులు అయినారు. వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నెలకు 40 రూపాయల వేతనంపై మీర్‌మున్షీ (హెడ్‌క్లర్క్) ఉద్యోగంలో చేశారు. ఎనిమిది సంవత్సరాలు ఆ ఉద్యోగంలో ఉండి హైదరాబాద్ కొచ్చి 'లా' పరీక్ష పూర్తిచేసి ప్రాక్టీసు పెట్టారు. వకాలత్ విడిచి పెట్టేనాటికి ఆయనకు నెలకు ఆరువందల ఆదాయం వచ్చేది. పంతులు సేవ రాజకీయ పార్టీల ద్వారా జరగ లేదు. నిర్మాణాత్మకమైన సంస్థలద్వారా జరిగింది. ఒకానొక పరాభవాగ్నిలోంచి పుట్టింది నిజాం ఆంధ్రోద్యమం. 1921 సంవత్సరం నవంబరు 12వ తేది వివేక వర్ధనీ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ హిందూ సంస్కార సభ జరుగగా, ఆ సభలో అనేక మంది ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీ భాషలలో మాట్లాడు తున్నారు. ఆంధ్ర ప్రతినిధులు మాడపాటి హనుమంతరావు, ఆలంపల్లి వెంకటరామారావు, ఇద్దరూ హైకోర్టు న్యాయవాదులు. మహారాష్ట్ర బాహుళ్యమైన సభలో తెలుగులో మాట్లాడినారు. సభలోని వారు విసుక్కున్నారు. నిరసన ప్రకటించారు. అల్లరి చేసారు. తమ వీపులు సభావేదిక వైపు తిప్పి వినమన్నారు. ఈ దుశ్చర్య, అవమానం ఆంధ్రులు భరించలేక పోయారు. ఆ రాత్రికి రాత్రే టేకుమల రంగారావు ఇంట్లో సమావేశమై కర్తవ్యం ఆలోచిం చారు. ఆంధ్రుల అభిమాన సంరక్షణ కోసం, ఆంధ్రుల వ్యక్తిత్వ నిరూపణ కోసం ఒక సంఘం స్థాపించు కోవాలని నిర్ణయించు కున్నారు. ఆ సంఘం పేరు నిజాం రాష్ట్ర ఆంధ్రజన సంఘం. అధ్యక్షుడు రావు బహదూర్ సామల వెంకటరెడ్డి, కార్యదర్శి మాడపాటి హనుమంతరావు. తరువాత మహారాష్ట్ర కన్నడ పరిషత్తులు కూడా ఏర్పాడ్డాయి. నాటి వరకు ఏ ఉద్యమమైనా నగరానికే పరిమితమై ఉండేది. ఆంధ్రులుగా గ్రామ సీమలకు వెళ్లారు. ఆంధ్రులలో ఐకమత్యం, చైతన్యం, విద్య, స్త్రీల వికాసం మొదలైన వాటికి కారకులయ్యారు. తాము మేల్కొని ఇతరులను మేల్కొలి పారు. ఆంధ్రసంఘం పెద్ద ఆశయాలతో బయల్దేరింది. గ్రామీణుల విజ్ఞానం వృద్ధి చేసి, వాళ్ళ కళ్ళు తెరిపించడానికి గ్రంథాలయాలు, రైతుల ఇక్కట్లు పోగొట్టడానికి రైతు సంఘాలు, వ్యాపార పరిస్థితులు బాగు పరచ దానికి వర్తక సంఘాలను స్థాపించింది. పటేల్–పట్వారీల జులంతో, భూస్వాముల వెట్టి చాకిరితో, అధికారుల దౌర్జన్యంతో బాధపడుతున్న నిర్భాగ్యపు ప్రజల శ్రేయస్సుకోసం పనిచేసింది. ఆంధ్ర జన సంఘం నాయకులు జిల్లాలు తిరిగి కర్తవ్య ప్రబోధం చేశారు. మాడపాటి గ్రంథాలయోద్యమం లోనూ చెప్పుకోదగ్గ కృషి సాగించారు. ఆయన తనకు సన్మానం ద్వారా లభించిన సొమ్మును కూడా గ్రంథాలయాల అభివృద్ధికే అంద జేశారు. హైదరాబాద్ లోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, హనుమకొండ లోని రాజరాజ నరేంద్ర ఆంధ్ర గ్రంథాలయం కూడా ఆయన అభివృద్ధి చేసినవే. వీటిలో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం నిజాం పాలిత తెలుగు ప్రాంతంలోని తొలి తెలుగు గ్రంథాలయంగా చారిత్రిక ప్రశస్తి పొందింది. ఆ రోజుల్లో గ్రంథాలయాలు నడ పడం అంత సులభమైన పనికాదు. నాటి ప్రభుత్వ దృష్టిలో గ్రంథాలయా లంటే విప్లవ కేంద్రాలే. అయినా పాలకులతో ఉత్తరాల ద్వారా అనుమతులు పొందారు. 4వ ఆంధ్ర మహాసభ కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో 1935 సంవత్సరం జనవరి 26, 27, 28 తేదీలలో జరిగింది. గద్దె నెక్కించడమేకానీ తాను ఎక్కే స్వభావం హనుమంతరావులో లేదు. సభ్యులు పట్టుపట్టాక, పంతులు అధ్యక్ష పీఠం వహించక తప్పలేదు. అప్పుడే అక్కడే జరిగిన మహిళా సభకు పంతులు అర్ధాంగి అధ్యక్షత వహించారు. భర్త, మరొక వైపు భార్య ఒకేసారి ఒక స్థలంలో జంటగా సాగుతున్న ఆంధ్ర మహా సభకు, ఆంధ్ర మహిళా సభకు అధ్యక్షత వహించడం అపూర్వం, అపురూపం. మాడపాటి షష్టిపూర్తి ఉత్సవం 1946 ఫిబ్రవరిలో రెడ్డి హాస్టల్ ఆవరణలో మహావైభవోపేతంగా జరిగింది. దీనికి రాజ్ బహదూర్ వెంకట్రామి రెడ్డి ఆహ్వాన సంఘాధ్యక్షులు కొండా వెంకటరంగారెడ్డి కార్యదర్శి. ఇందులో పంతులుకు తులాభారం జరుపగా, సంబంధిత రూ.6400 డబ్బును ఆయన మహిళా కళాశాలకు విరాళంగా ఇచ్చారు. హనుంతరావు బాలికల కోసం నారాయణ గూడలో స్థాపించిన పాఠశాల ఆయన స్మారక కళాశాలగా నడుస్తున్నది. బూర్గుల ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంతులు ఉస్మానియాకు శాశ్వత సెనెటు సభ్యులుగా నియమితులైనారు. తరువాత నాలుగేళ్ళు సిండికేటు సభ్యులుగా ఉన్నారు. భారత దేశములో ప్రప్రథమ బాలికల పాఠశాలలో ఒకటైన మాడపాటి హనుమంతరావు బాలికోన్నత పాఠశాల హైదరాబాదులో నారాయణ గూడలో స్థాపించాడు. బాలికల కోసం ఆయన ఎన్నో పాఠశాలలను నెలకొల్పారు. ఆయన విద్యారంగానికి చేసిన సేవలను పురస్కరించుకొని ఉస్మానియా విశ్వ విద్యాలయం 1956లో డాక్టరేటు బిరుదు నిచ్చి సత్కరించింది. 1955లో కేంద్ర ప్రభుత్వం 'పద్మ భూషణ' బిరుదు ప్రసాదించింది. ఆ బిరుదు పొందిన తెలుగు వారిలో ఆయనే ప్రథములు. అనారోగ్య కారణాలతో ఢిల్లీ వెళ్ళలేక పోగా, మరుసటి సంవత్సరం రాష్ట్రపతి డా.బాబు రాజేంద్రప్రసాద్ హైదరాబాద్ విచ్చేసినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో స్వహస్తాలతో మాడపాటికి 'పద్మ భూషణ్' బహూకరించారు. మాడపాటి మంచి కవి, రచయిత. మొత్తం పదమూడు కథలు రాశారు. వీటిలో హృదయశల్యం, రాణీసారందా, ముసలిదాని ఉసురు, నేనే, అగ్ని గుండం, నాడు నీ పంతం, నేడు నా పంతం, ఆత్మార్పణం, తప్పు, ఎవరికి, విధి ప్రేరణం అనే కథలు 'మల్లికాగుచ్ఛం' పేరుతో 1911 లో పుస్తక రూపం దాల్చాయి. మాడపాటికి రచయితగా శాశ్వత కీర్తిని అందించిన గ్రంథం 'తెలంగాణ ఆంధ్రోద్యమం'.రాష్ట్రానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత 1951లో హైదరాబాద్ నగర పాలక సంఘానికి పంతులుగ తొలి మేయరుగా ఎన్నికయ్యారు. ఆ పదవికి మూడు సార్లు ఎన్నికవుతూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ అధ్యక్షునిగా ఆయన ఆరేళ్ళు పదవిలో ఉండి, ఉన్నత ఆదర్శాలతో సభ్యులందరికి మన్ననలు పొందారు. మాడపాటి దూరదృష్టి, స్వార్థ రాహిత్యం, క్రమశిక్షణ, నిర్వహణలో దక్షత వంటివి కలిగిన వ్యక్తి. అందరినీ కలుపుకు పోయే లక్షణం, ఉద్వేగం లేని స్వభావం వల్ల ఆయన అజాత శత్రువుగా నిలిచారు.రాజకీయాల్లో ఆయన మితవాది, అయినా ఆయన రాజకీయాదర్శాలను వ్యతిరేకించే కమ్యూనిస్టులు కూడా ఎంతగానో గౌరవించేవారు. శాసన మండలి అధ్యక్ష పదవీ విరమణ అనంతరం విశ్రాంతి జీవితాన్ని గడుపుతూ 1970 నవంబరు 11వ తేదీన తమ 86వ ఏటా మరణించారు.

# విద్యారంగానికి బాటలు వేసిన ఆద్యుడు

దేశంలో విద్య అభివృద్ధికి తొలి బాట వేసిన విద్యాధికుడు అబుల్ కలాం ఆజాదే. ఆయన భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా పని చేశాడు. నవంబర్ 11న ఆయన జన్మదినం సందర్భంగా మన దేశంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపు కుంటారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ (నవంబర్ 11, 1888– ఫిబ్రవరి 22, 1958) స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖా మంత్రి, మౌలా నా అబుల్ కలాం ఆజాద్. ఆయన అసలుపేరు 'మొహి యుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలాం' అనేది బిరుదు, 'ఆజాద్' కలంపేరు. ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్ లకు 1888 నవంబరు 11 న మక్కాలో జన్మించాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ మక్కా నగరంలో 1888 నవంబర్ 11 న జన్మించారు. ఆయన వంశస్తులు బాబర్ రోజుల్లో హేరాత్ (ఆఫ్ఘనిస్తాన్ లో ఒక నగరం) కు చెందిన వారు. ఆజాద్ ముస్లిం పండితులు/ మౌలానాల వంశం నుండి వచ్చాడు. ఆయన తల్లి అరబ్, షేక్ మహ్మద్ జహీర్ వత్రి, తండ్రి మౌలానా ఖైరుద్దీన్ ఆఫ్ఘన్ మూలాలు గల ఒక బెంగాలీ ముస్లిం. ఖైరుద్దీన్ సిపాయి తిరుగుబాటు సమయంలో భారతదేశం నుండి మక్కా వెళ్ళి అక్కడే స్థిరపడ్డాడు. 1890 లో అయన తన కుటుంబంతో కలకత్తా వచ్చాడు. ఆజాద్ సంప్రదాయ ఇస్లామిక్ విద్య అభ్యసించాడు. ఆయన విద్య ఇంట్లో సాగింది. మొదట తండ్రి పిదప ఉపాధ్యాయులు ఇంట్లోనే బోధించాడు. ఆజాద్ మొదట అరబిక్, పెర్షియన్ తరువాత తత్వశాస్త్రం, రేఖాగణితం, గణితం, బీజగణితం నేర్చుకున్నాడు. స్వీయ అధ్యయనం ద్వారా ఇంగ్లీష్, ప్రపంచ చరిత్ర, రాజకీయాలు నేర్చుకున్నాడు. ఆజాద్ మౌలానా అగుటకు కావలసిన మత శిక్షణ పొందాడు. ఆయన దివ్య ఖురాన్ పై భాష్యం రాశాడు. విదేశాల నుంచి తిరిగి వచ్చాక ఆజాద్, బెంగాల్ కు చెందిన అరవింద ఘోష్, శ్యాం సుందర్ చక్రవర్తి వంటి ప్రముఖ విప్లవకారులను కలుసుకున్నాడు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాన్ని చేపట్టాడు. విప్లవాత్మక చర్యలు బెంగాల్, బీహార్‌లకు పరిమితం అయిన విషయం ఆజాద్ కు తెలిసి రెండు సంవత్స రాలలో, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉత్తర భారతదేశం, బాంబే లాంటి ప్రాంతాలలో రహస్య విప్లవ కేంద్రాలు ఏర్పాటుచేసాడు. ఆ సమయంలో విప్లవ వాదులు ముస్లింల విప్లవ వ్యతిరేకులుగా భావించసాగారు. ఎందుకంటే బ్రిటిష్ ప్రభుత్వం భారత దేశం యొక్క స్వాతంత్ర్య పోరాటా నికి వ్యతిరేకంగా ముస్లిం కమ్యూనిటీని ఉపయోగిస్తున్నాదని భావించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ తన సహచరు లను ముస్లింల పట్ల వారి పగను పోగొట్టటానికి ప్రయత్నిం చాడు. 1912 లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూలో ' అల్ హిలాల్' వార పత్రిక ముస్లింల మధ్య విప్లవాత్మక భావాలను పెంచడానికి ప్రారంభించాడు.



ఆజాద్ భారతీయ జాతీయ వాదం, హిందూ –ముస్లిం ఐక్యత ఆధారంగా విప్లవాత్మక ఆలోచనలతో మరో పత్రికను "అల్ బలఘ్" ప్రారంభించాడు. మౌలానా ఆజాద్, గాంధీజీ ఉప్పు సత్యా గ్రహంలో పాల్గొని 1930 లో అరెస్టు అయినాడు. ఆయనను ఒక సంవత్సరంన్నర పాటు మీరట్ జైల్లో ఉంచారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1940 (రాంగడ్) లో కాం గ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికై, 1946 వరకు ఆ పదవిలో ఉన్నా డు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యా గ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్ర్య సమర ముఖ్య నాయకులలో ఒకడు. ఆయన ప్రఖ్యాత పండితుడు, కవి. 1947 ఆగస్టు 15 నుండి అంటే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 1958 ఫిబ్రవరి 2 వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రిగా సేవలు అందించాడు. ఈయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డు ఇచ్చింది. అంతే కాదు ఆయన పేరిట పలు విద్యాసంస్థలు కూడా నెలకొల్ప బడ్డాయి. అబుల్ కలాం మంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలోని ప్రసిద్ధ జామియా మిలియా ఇస్లామియా విశ్వ విద్యాలయం సహా భారతదేశం అంతటా వివిధ కళాశాలలు మరియు విశ్వ విద్యాలయాలు స్థాపించ బడ్డాయి. ఆయన సేవలకు గుర్తుగా 2008లో భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్ణయించింది. స్వాతంత్ర్య సమర యోధుడిగా, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన అబుల్ కలాం ఆజాద్ అసలు పేరు 'మొహియుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలామ్' అనేది బిరుదు.. 'ఆజాద్' అనేది ఆయన కలం పేరు. ఆయన అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ తదితర భాషలలో మంచి ప్రావీణ్యత సంపాదించాడు. స్వయంగా సాహితీవేత్త అయిన ఆయన 'ఇండియా విన్స్ ఫ్రీడమ్'ను రాశాడు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన దేశంలో విద్యావ్యవస్థ పటిష్టతకు, విద్యా వ్యవస్థను మెరుగు పరిచేందుకు అంకిత భావంతో పనిచేశాడు. చిన్నపిల్లల్లో ప్రాథమిక విద్యను ప్రోత్సహించడానికి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడాన్ని ప్రోత్సహించారు. పాఠశాలలు, కళాశాలల నిర్మాణానికి జాతీయ కార్యక్రమాన్ని ప్రణాళికను రూపొందించాడు. 14 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలకు ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించే ఆలోచనను ఆయనే ముందుకు తెచ్చాడు. అలాగే "ప్రతి ఒక్కరూ ప్రాథమిక విద్యను పొందడం వ్యక్తి జన్మహక్కుగా పరిగణించాలి. లేదంటే పౌరులుగా తమ విధులను పూర్తిగా నిర్వర్తించలేరు" అని అబుల్ కలామ్ ప్రాథ మిక విద్య గురించి వివరించాడు. అంతే కాదు, ఆడపిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో అనేక పథకాలను తీసుకొ చ్చాడు. ఆయన మార్గదర్శకత్వం మరియు నాయకత్వంలో విశ్వవిద్యాలయ గ్రాంట్ కమిషన్ (యుజిసి)ని విద్యా మంత్రిత్వ శాఖ 1953లో స్థాపించింది. అలాగే 1951లో అబుల్ నాయకత్వంలో మొదటి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్థాపించ బడింది. ఆయన ఒక దూరదృష్టిగల వ్యక్తి, భవిష్యత్ సాంకేతిక నిపుణులను రూపొందించడంలో ఐఐటిల సామర్థ్యాన్ని నమ్ముతాడు. "ఈ ఇన్స్టిట్యూట్ స్థాపన దేశంలో ఉన్నత సాంకేతిక విద్య మరియు పరిశోధనల పురోగతిలో ఒక మైలురాయిగా మారుతుంది అనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు" అని మౌలానా ఆజాద్ పేర్కొన్నాడు. గాంధీజీ ఆయనను భారత ప్లాటో అని, గాంధీ , నెహ్రూ ఆయనను మౌలానా, మీర్–ఎ–కారవాన్ అని పిలిచేవాడు. 1992లో భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించింది.


# ఏపీ, రాజస్థాన్ ప్రమాదాలను సుమోటోగా స్వీకరించిన 'సుప్రీం'



ఇటీవల ఆంధ్రప్రదేశ్, ఏపీలో ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే. రాజస్థాన్‌లో రోడ్డు ప్రమాదంలో ఈ ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏపీలో బస్సు దహనమై మరో 19 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. రెండు ఘటనలను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. జస్టిస్ జేకే మహేశ్వరి, విజయ్ విష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం జాతీయ రహదారుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. రాజస్థాన్‌లోని జాతీయ రహదారులపై ఉన్న ధాబాలు, ఇతర సంస్థల సంఖ్యను వివరిస్తూ రెండువారాల్లోగా వివరణాత్మక స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయాలని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ని ఆదేశించింది. రహదారి పరిస్థితులపై నివేదికను కూడా ఇవ్వాలని చెప్పింది. ఈ కేసులో సీనియర్ న్యాయవాది ఏఎస్ నాదకర్ణిని అమికస్ క్యూరీగా నియమించిన ధర్మాసనం.. స్టేటస్ నివేదికను దాఖలు చేయడానికి రాజస్థాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని పార్టీగా చేర్చాలని ఆదేశించింది. రాజస్థాన్ ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు అడ్వకేట్ జనరల్ శివ్ మంగళ్ శర్మ.. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కోర్టుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అలాగే, కర్నూలు రోరడ్డు ప్రమాదాన్ని సైతం కోర్టు పరిగణలోకి తీసుకుంది. జాతీయ రహదారి భద్రత, రోడ్డు పక్కన ఉన్న నిర్మాణాల నియంత్రణ కోసం సమన్వయ విధానం అవలంభించడానికి ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని పార్టీగా చేయాలని ఆదేశించింది. దేశంలో రోడ్డు ప్రమాదాలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. నిత్యం వందల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతుండగా.. ఇందులో ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారాయి. తీ క్రమంలో సుప్రీంకోర్టు ప్రమాదాలపై దృష్టి సారించింది. నేషనల్ హైవేలపై ప్రమాదాలు కేవలం డ్రైవింగ్ లోపాలు మాత్రమే కాకుండా.. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల జరుగుతున్నట్లుగా కోర్టు పేర్కొంది. ఈ క్రమంలో ఈ వ్యవహారంపై ద్విసభ్య ధర్మాసనం స్పందించింది. రోడ్ల పక్కన అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన దాబాలు, టీ దుకాణాలు, లారీ పార్కింగ్ కేంద్రాలు ప్రమాదాలకు కారణమని పేర్కొంది. అదే సమయంలో రహదారుల నిర్వహణలో కాంట్రాక్టర్లు, స్థానిక అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లుగా పేర్కొంది. రోడ్లపై గుంతలు, లైటింగ్ లేకపోవడం, రోడ్డు పక్కన సరైన రక్షిత గోడలు లేకపోవడం వల్లే ప్రమాదాల తీవ్రత మరింత పెంచుతున్నట్లుగా అభిప్రాయపడింది. ఈ క్రమంలోనే ఏపీ, రాజస్థాన్ ప్రమాదాలపై సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా రహదారుల పరిస్థితిపై, భద్రతా చర్యలు, ప్రమాదాలకు కారణాలపై పూర్తి నివేదికను ఇవ్వాలని ఆదేశించింది. రోడ్ల పక్కన అనుమతి లేకుండా ఉన్న దాబాలు, హోటళ్లు, వర్క్‌షాప్‌లు ఎన్ని ఉన్నాయో సమగ్రంగా సర్వే చేయాలని ఆదేశించింది. రహదారుల నిర్మాణం, నిర్వహణ విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? అన్న అంశంపై సైతం దృష్టి సారించింది. ప్రమాణాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. రోడ్ల నిర్వహణ అనేది నిర్మాణ మాత్రమే కాదని.. ప్రజల భద్రతకు సంబంధించిందని ధర్మాసనం స్పష్టం చేసింది.

# అన్ని విద్యాసంస్థల్లో వందేమాతరం తప్పనిసరి.. యూపీ సీఎం ప్రకటన

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో ఇక నుంచి వందేమాతరం గేయాలాపనను తప్పనిసరి చేస్తున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలలో వందేమాతరం పాడటం తప్పనిసరి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గోరఖ్‌పూర్‌లో 'ఏక్తా యాత్ర' పేరుతో నిర్వహించిన సామూహిక వందేమాతరం గేయాలాపన కార్యక్రమంలో ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. విద్యాసంస్థల్లో జాతీయ గీతాలాపన చేయడంవల్ల విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే దానిపై గౌరవం, దేశభక్తి ఏర్పడుతాయని ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి నవంబర్ 7తో 150 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. కాగా ఈ గేయాన్ని 1875 నవంబర్ 7న కించంద్ర ఛటర్జి రాశారు. ఈ గేయం తొలిసారి ఛటర్జి రాసిన 'ఆనంద్ మఠ్' నవలలో ప్రచురితమైంది. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. వందేమాతరం గేయం ఒక స్వప్నం, ఒక సంకల్పం, ఒక మంత్రమని అన్నారు. ఈ శబ్దం ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని, భవిష్యత్తుకు సరికొత్త భరోసా ఇస్తుందని పేర్కొన్నారు.



# మా డీప్‌ఫేక్ ఫొటోలూ చూశాం ఏఐ దుర్వినియోగంపై సీజేఐ

**ఢిల్లీ:** ఈ ఆధునిక సాంకేతిక యుగంలో చాలా మంది ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో డీప్‌ఫేక్ ఒకటి. వాయిస్ క్లోనింగ్, డీప్‌ఫేక్, చాట్‌బాట్ ఫిషింగ్ వంటి టూల్స్, యాప్స్‌ను ఉపయోగించి దీని ద్వారా సైబర్ నేరగాళ్లు తేలికగా మోసాలకు పాల్పడుతున్నారు. ఈ డీప్‌ఫేక్ ఫొటోలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ సైతం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏఐ దుర్వినియోగం న్యాయవ్యవస్థపై కూడా పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎందరో న్యాయమూర్తులు, న్యాయవాదుల మార్ఫింగ్ చిత్రాలు కూడా తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఏఐ దుర్వినియోగం విషయంలో న్యాయవాదులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాధారణ ఏఐకి, జెన్ ఏఐకి మధ్య చాలా వ్యత్యాసముందని..జెన్ ఏఐని న్యాయవ్యవస్థలోకి వస్తే అది ఉనికిలో లేని చట్టాలను కూడా రూపొందిస్తుందని



న్యాయవాది కార్తికేయ రావల్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీని వల్ల న్యాయ వ్యవస్థలో అస్పష్టత నెలకొంటుందని.. కాబట్టి న్యాయ సంస్థలలో జనరేటివ్ ఏఐ వినియోగాన్ని నియంత్రించడానికి మార్గదర్శకాలను రూపొందించేలా ఆదేశాలు జారీ చేయాలని సుప్రీం కోర్టును కోరారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం సోషల్ మీడియాలో తమ డీప్ ఫేక్ ఫొటోలు కూడా ఉండడం చూసి ఆందోళనకు గురైనట్లు పేర్కొంది. ఈ కేసుపై విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఏఐ అనేది మనిషి మెదడు లాగా ఆలోచించి, నేర్చుకుని, సమస్యలు పరిష్కరించే టెక్నాలజీ. కానీ జనరేటివ్ ఏఐ కేవలం మనం అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడమే కాకుండా కొత్త విషయాలను సృష్టిస్తుంది. దానికి ఒక్క మాట చెప్పగానే ఎటువంటి సమాచారం ఇవ్వకపోయినా కథలు రాస్తుంది. ఫొటోలు, వీడియోలు రూపొందిస్తుంది. పాటలు కంపోజ్ చేస్తుంది. ఎటువంటి కొత్త విషయాలనైనా సొంతంగా సృష్టించగలుగుతుంది.

# ఐదేళ్ల విరామం తర్వాత భారత్-చైనా మధ్య ఫ్లైట్ సర్వీస్

చైనా ఈస్ట్రన్ ఎయిర్‌లైన్స్ సంస్థ ఆదివారం షాంఘై-ఢిల్లీ విమాన సర్వీసును ప్రారంభించింది. 95 శాతం ఆక్యుపెన్సీతో ఈ విమానం నడిపింది. ఐదేళ్ల విరామం తర్వాత భారత్‌కు నేరుగా విమాన సర్వీసులను నడుపుతున్న చైనా తొలి విమానయాన సంస్థగా ఈస్ట్రన్ ఎయిర్‌లైన్స్ నిలిచింది. ఎంయూ 563 విమానం.. 248 మంది ప్రయాణికులతో షాంఘైలోని పుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరింది. భారత్‌కు చెందిన ఇండిగో సంస్థ సోమవారం నుంచి ఢిల్లీ-గువాంగ్‌ఝౌకు విమాన సర్వీసులను నడపనుంది. షాంఘై-ఢిల్లీ మార్గం అత్యంత కీలకమైనది. ఈ నూతన విమాన సర్వీసువల్ల రెండు దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక, సాంస్కృతిక సంబంధ రాకపోకలు పెరుగుతాయని చైనా అధికారిక 'గ్లోబల్ టైమ్స్' పత్రిక పేర్కొంది. కొవిడ్-19 మహమ్మారి కారణంగా 2020లో రెండు దేశాల మధ్య విమాన సర్వీసులు నిలిచిపోయాయి. ఆ తర్వాత కరోనా ప్రభావం తగ్గినా తూర్పు లధఖ్‌లో ఉద్రిక్తతలవల్ల విమాన సర్వీసుల పునరుద్ధరణ సాధ్యం కాలేదు. ఈ క్రమంలో నవంబర్ 26న రెండు దేశాల మధ్య విమాన రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. నాడు కోల్‌కతా నుంచి బయల్దేరిన ఇండిగో విమానం గువాంగ్‌ఝౌలో దిగింది.




## భారత్ చుట్టూ ఉగ్రవాద విస్తరణకు పాక్ కుట్ర



భారత్ చుట్టూ ఉగ్రవాదాన్ని విస్తరించేందుకు పాకిస్థాన్ కుట్రలు పన్నుతుందని భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం భారత సరిహద్దు దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉగ్ర నివాసాలు, శిక్షణ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. బంగ్లాదేశ్, నేపాల్ సరిహద్దులకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉగ్ర స్థావరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు భారత ఇంటెలిజెన్స్‌ను ఉటంకిస్తూ ఆంగ్ల మాధ్యమ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ కార్యకలాపాలు మరింత వేగవంతమైనట్లు తెలుస్తోంది. ఉగ్రవాద శిక్షణ పొందే వారి కోసం బంగ్లాదేశ్, నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో కొత్త శిక్షణ శిబిరాలు, నివాస సముదాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. సరిహద్దులోని రాష్ట్రాల్లో ఇటీవల ఉగ్రవాద సంస్థలకు చెందిన వారిని అరెస్టు చేయగా, వారి విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను పెంచినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. పొరుగు దేశాల్లో విదేశీ నిధులతో ఏర్పాటవుతున్న పలు ప్రాజెక్టులపై కూడా నిఘా ఉంచినట్లు పేర్కొన్నాయి. లష్కరే తోయిబా, జైష్ ఏ మహమ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలు నేపాల్‌లో తమ సంస్థలను విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆల్-ఖైదా, ఐసిస్ గత ఐదు నెలలుగా బంగ్లాదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశాయని తెలిపాయి. ఇందులో భాగంగా పాక్‌లోని పలు ప్రాంతాల నుంచి బంగ్లాదేశ్‌కు, నేపాల్‌కు నిరంతర వలసలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నాయి. ఆయా దేశాల్లో ఉగ్రవాద శిబిరాల నిర్మాణాలకు, నిర్వహణకు అవసరమైన నిధులను టర్కీ సమకూరుస్తున్నట్లు సమాచారం. ఢాకాలోని జమాత్-ఈ-ఇస్లామీ కార్యాలయం పునరుద్ధరణకు టర్కీ నిఘా సంస్థ నిధులు సమకూర్చినట్లు కూడా ఈ నిఘా వర్గాలు వెల్లడించాయి.

## కర్ణాటకలో సీఎం మార్పు?



**ఢిల్లీ:** ముఖ్యమంత్రి మార్పు ఊహాగానాల నేపథ్యంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని సమాచారం. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందనే ప్రచారం కొంతకాలంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీ.కె. శివకుమార్ బెంగళూరు, ఢిల్లీల మధ్య పర్యటిస్తున్నారు. నవంబర్ చివరి నాటికి రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు చోటుచేసుకుంటాయనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య మరోసారి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పెద్దలతో సమావేశమయ్యేందుకు ఆయన సమయం కోరగా, ఆ సమావేశం అవసరం లేదని కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనకు స్పష్టం చేసిందని తెలుస్తోంది. కేంద్ర నాయకత్వం సమయం ఇవ్వడానికి నిరాకరించినప్పటికీ, సిద్ధరామయ్య తన ప్రభుత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారు. మరో రెండున్నరేళ్లు తమ పార్టీయే అధికారంలో ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌కే ప్రజలు ఓటు వేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం, కర్ణాటకలో జరిగిన ఓ సభలో సిద్ధరామయ్య మాట్లాడుతూ, తన ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం ఉందని, రాబోయే రెండున్నరేళ్లూ తామే అధికారంలో ఉంటామని, తదుపరి ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌దే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, సిద్ధరామయ్య శిబిరానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు ఢిల్లీలో సమావేశమయ్యారు. ఆయన సోదరుడు, కొప్పల్ ఎంపీ రాజశేఖర్ హిట్నాల్ తన నివాసంలో విందు ఏర్పాటు చేశారు. ఇది పేరుకే విందు అయినా.. అంతర్గతంగా సిద్ధరామయ్య బల ప్రదర్శనగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## బీహార్‌లో రెండో దశ పోలింగ్‌కు సర్వం సిద్ధం



బీహార్‌లో రెండో దశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొదటి దశలో 121 స్థానాల్లో పోలింగ్ జరుగగా.. మిగిలిన 122 స్థానాలకు రెండో దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ దశలో మొత్తం 1302 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని పరీక్షించుకోనున్నారు. సుమారుగా 4 కోట్ల మంది ఓటర్లు వారి గెలుపోటములను నిర్ధారించనున్నారు. రెండో దశలో భాగంగా పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామర్హి, మధుబని, సుపౌల్, అరేరియా, కిషన్‌గంజ్ తదితర జిల్లాల్లో పోలింగ్ జరగనుంది. పోలింగ్ నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. మొత్తం 4 లక్షల మంది పోలీసులు, పారా మిలిటరీ బలగాలను ఇందుకు వినియోగించారు. ఇప్పటికే సిబ్బంది పోలింగ్‌కు అవసరమైన సామాగ్రితో సంబంధిత బూత్‌లకు చేరుకున్నారు. తొలి దశలో మాదిరిగా ఈ దిశలో కూడా నితీశ్ సర్కారులోని పలువురు మంత్రులు, ముఖ్య నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో మహాగఠ్‌బంధన్, ఎన్డీయే కూటమిల మధ్యనే ప్రధాన పోటీ నెలకొని ఉంది. వీరితోపాటు కొత్తగా ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ, లాలూ యాదవ్ పెద్దకుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ నేతృత్వంలోని జన్‌శక్తి జనతాదళ్ పార్టీ బరిలో నిలిచాయి.

## ఢిల్లీలో భారీ పేలుడు



**ఢిల్లీ:** ఎర్రకోట వద్ద భారీ పేలుడు కలకలం సృష్టించింది. ఎర్రకోట వద్ద కారులో భారీ పేలుడు ధాటికి ఐదుకార్లు ధ్వంసమయ్యాయి. పలువురికి గాయాలయ్యాయి. పేలుడుపై ఢిల్లీ అగ్నిమాపక శాఖ అధికారిక ప్రకటన సైతం చేసింది. సోమవారం సాయంత్రం ఎర్రకోట మెట్రో స్టేషన్‌లోని గేట్ నెం. 1 సమీపంలో కారులో పేలుడు సంభవించినట్లు సమాచారం అందింది. ఆ తర్వాత మూడు నాలుగు వాహనాలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి'అని వెల్లడించింది. ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుంది.

# ప్రజా కవి అందెశ్రీ అస్తమయం

మొదటిపేజీ తరువాయి

అలుముకున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రేబర్తి గ్రామానికి చెందిన అందే బొడ్డయ్య, ఎల్లమ్మ దంపతులకు ముగ్గురు సంతానం ఇద్దరు కుమారులు, ఒక కూతురు, వీరిలో ఒకరు అందె ఎల్లయ్య( అందెశ్రీ) చిన్ననాటి నుండి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు. తన తండ్రి బుడ్డయ్య గ్రామానికి చెందిన జక్కిరెడ్డి మల్లారెడ్డికి పశువుల కాపరిగా జీతం ఉంచాడు.

అందెశ్రీ కలం నుంచి జాలువారిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర అధికారిక గీతంగా గుర్తించిన విషయం తెలిసిందే. తన పాటలు, రచనలతో ఆయన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమ సమయంలో ఆయన గీతాలు ప్రజల్లో స్ఫూర్తిని రగిలించాయి.

ఎటువంటి పాఠశాల విద్య అభ్యసించకుండా, కేవలం తన ప్రతిభతోనే గొప్ప కవిగా అందెశ్రీ పేరు తెచ్చుకున్నారు. ఆయన రాసిన 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు' అనే గీతం తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఈ పాట ఆయనకు విస్తృతమైన కీర్తిని తెచ్చిపెట్టింది. అందెశ్రీ మృతి పట్ల పలువురు ప్రముఖులు, సాహితీవేత్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఆయన మరణం తెలుగు సాహిత్య లోకానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.

**కూలీ నుంచి గేయ రచయి వరకు..**

అక్కడ నుండి అదే గ్రామానికి చెందిన ఎండీ మునీర్ వద్ద కూడా అందెశ్రీ పశువుల కాపరిగా జీతం ఉన్నాడు. జీతం చేస్తూనే మేస్త్రి పని నేర్చుకొని నిజామాబాద్ జిల్లాకు వలస కూలిగా వెళ్లి అక్కడ పనిచేశాడు. 1980 సంవత్సరంలో తిరిగి రేబర్తి గ్రామానికి వచ్చి అక్కడనుండి చేర్యాల ప్రాంతానికి మేస్త్రి పని చేశాడు. నాడు వరంగల్ జిల్లా(%ఘొుతీఘఅస్త్రుశ్రీ%) అదనపు కలెక్టర్ చేర్యాలలో పాటలు, సాహిత్య పోటీలు నిర్వహించడంతో ఆ పోటీలలో మొట్టమొదటగా పాల్గొని మొదటి బహుమతి పొందాడు. 1987లో రేబర్తి సొసైటీ డైరెక్టర్‌గా గెలుపొందాడు. చేర్యాల మండలం బండపల్లి గ్రామానికి చెందిన మల్లవ్వ తో వివాహం జరిగింది. వీరికి నలుగురు సంతానం.

**సమాజాన్ని మేలుకొల్పేలా**

ముగ్గురు కుమార్తెలు. ఒక కుమారుడు ఉన్నాడు. అప్పటి నుండి పాటలు రాస్తూ హైదరాబాద్‌కు కుటుంబంతో తరలి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. కాగా, శృంగేరి మఠానికి సంబంధించిన స్వామీ శంకర్ మహారాజ్ ఇతను పాడుతుండగా విని ఇతడిని చేరదీసాడు. నాటి నుంచి నేటి వరకు ఆయన కలం నుంచి సమాజాన్ని మేలుకొల్పే ఎన్నో గేయాలు వెలువడ్డాయి. తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ పాటలు ఉద్యమాన్ని ఉర్రూలూగించాయి. సినీ నటుడు నారాయణ మూర్తి ద్వారా వచ్చిన విప్లవాత్మక సినిమాల విజయం వెనుక ఈ పాటలున్నాయి. తెలంగాణ, ప్రకృతి లాంటి అంశాలపై గేయరచన చేసారు. అందెశ్రీ మృతితో రేబర్తిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఊరితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని స్థానికులు కంటతడి పెట్టుకున్నారు.

**అందెశ్రీకి ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు...**

ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ (64) ఆయన మృతిపట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావును ఆదేశించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో అందెశ్రీ ఇవాళ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రికి తీసుకువచ్చే లోపే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అందెశ్రీ ఆకస్మిక మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన అంత్యక్రియలను అధికార లాంఛనాలతో జరిపించాలని సీఎస్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వెంటనే విడుదల చేసి, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు.

పూడ్చలేని లోటు... అందెశ్రీ అస్తమయంపై మోదీ ట్వీట్

తెలంగాణ రాష్ట్ర ఐకానిక్ గీతం "జయ జయ హే తెలంగాణ" రచయిత, ప్రఖ్యాత కవి అందె శ్రీ ఆకస్మిక మరణంపై ప్రధానమంత్ర నరేంద్ర మోదీ సంతాపం వెలిబుచ్చారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో ఒక సందేశాన్ని పోస్ట్ చేశారు. "అందెశ్రీ మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు. ఆయన ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి. ఒక గొప్ప కవి, మేధావి అయిన ఆయన, ప్రజల పోరాటాలకు , ఆకాంక్షలకు ,అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారు. ఆయన పదాలకు హృదయాలను కదిలించే శక్తి, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను ఏకం చేసే శక్తి,ప్రజల సాంఘిక హృదయస్పందనకి రూపం ఇచ్చే శక్తి ఉన్నాయి. ఆయన సామాజిక స్పృహను, సాహితీ సౌందర్యంతో మిళితం చేసిన విధానం అద్వితీయం. వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఓం శాంతి.' అంటూ ట్వీట్ చేశారు.

కాగా సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని నివాసంలో అనారోగ్యానికి గురైన అందెశ్రీని కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. తెలంగాణకు ఇది విచారకరమైన రోజు అంటూ పలువురు సాహిత్య, సంగీత అభిమానులు సంతాపం తెలిపారు. శక్తివంతమైన మాటల ద్వారా తెలంగాణకు ఆత్మీయ స్వరాన్ని అందించిన కవి అందెశ్రీ మరణం పట్లపై పలువురురాజకీయ ప్రముఖులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన రచనలు తరతరాలుగా స్ఫూర్తినిస్తాయంటూ అందెశ్రీ కుటుంబానికి, అభిమానులకు హృదయపూర్వక సంతాపం తెలిపారు.

# ఛాంబర్ ఎన్నికల కోసం కసరత్తులు

**ఖమ్మం :** 'ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఖమ్మం పట్టణ వ్యాపార వర్గాలకు సంబంధించిన ఓ సంఘం. దీని పరిధిలో 18 వ్యాపార వర్గాలు, వీటికి సంబంధించిన సభ్యులు 1305. మూడేళ్లకు ఓ సారి ఈ సంఘానికి ఎన్నికలు జరుగుతాయి. ఈ లెక్కన వీటికి సంబంధించిన ఎన్నికల తంతు నామమాత్రమే అనుకో వాలి. కానీ, దీనికోసం పోటీ పడబోయే ఆయా వర్గాల హడావిడి మినీ సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్నాయి.గెలుపు కోసం ఆయా వర్గాలు పోటీ పడుతూ, తీవ్రస్థాయిలో ప్రచారం చేస్తున్నాయి. అయితే ఇందులో ఓ వర్గం మాత్రం గెలుపే ధ్యేయం గా వింత పోకడలు పోతోంది. ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు 'మందు, విందు' అంటూ అడ్డదారులు తొక్కుతోంది. ఇందుకోసం చీకటి పడగానే ప్రత్యేక ఏర్పాట్లు చేసి భారీగానే ఖర్చు పెడుతోంది. సదరు వర్గం వ్యవహారాన్ని చూస్తున్న కొంతమంది విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 'చిన్నపాటి పదవుల కోసం ఈ స్థాయిలో దిగజారాలా?' అనే విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లకు ఓసారి జరిగే ఎన్నికల్లో ప్రధాన పానెల్ కు సంబంధించిన ఎన్నికే ముఖ్యమైనది. ఆ తరువాత దిగుమతి శాఖ కు ప్రాముఖ్యం ఉంటుంది. మిగతా శాఖలకు సంబంధించిన ఎన్నిక నామ మాత్రమే! ప్రధాన పానెల్ కు ఎన్నికల కోసం రెండు వర్గాలు ప్రధానంగా పోటీ పడుతున్నాయి. ఈ ప్యానెల్ లోనే అధ్యక్ష, ఉపాధ్యక్ష, సెక్రటరీ, ట్రెజరర్ల పదవులు ఉండటం, వీటికి ఎన్నికైన వారి చేతిలోనే ఛాంబర్ అధికారాలు ఉండటమే కాకుండా ఆయా శాఖల్లో, ముఖ్యంగా గ్రెయిన్ మార్కెట్లో పలుకుబడి ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో ప్రధాన పానెల్ ను ఎలాగైనా దక్కించుకోవాలని ఈ రెండు వర్గాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. సంఘం ఓటర్లను కలిసి తమకే ఓటు వేయాలని వేడుకోవడంతోపా టు, ప్రచార చిత్రాలను, బ్యానర్లను ప్రధాన మార్కెట్ కూడళ్లలో ఏర్పాటు చేసి గెలుపు కోసం ఆరాటపడుతున్నాయి. వీరి ప్రచారంతో త్రీ టౌన్ లోని గాంధీ చౌక్, గ్రెయిన్ మార్కెట్ ప్రాంతమంతా హడావుడిగా కనిపిస్తోంది. ప్రధాన పానెల్ కు పోటీ పడుతున్న ఓ వర్గం ఛాంబర్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని కసితో అడ్డదారుల్లో వెళ్లేందుకు ప్రయత్నిస్తోందని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. నామినేషన్ వేసిన రెండో రోజు నుంచే ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు ఎత్తులు వేసింది. మందు పార్టీలు ఏర్పాటు చేసి విందులు చేసింది. ఈ విష యం బయటకు పొక్కడంతో తమ ప్యానెల్ కు చెడ్డ పేరు వస్తోందని, దీనివల్ల తమ ఓటు బ్యాంకు కి చిల్లు పడే అవకాశం ఉందని భావించి వేరే మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. నేరుగా ముందు పార్టీ అని కాకుండా జన్మదిన వేడుకల ముసుగులో మద్యం పార్టీలు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.ఇందుకోసం ఛాంబర్ ఓటర్లలో ఎవరిదైనా పుట్టినరోజు ఉందేమోనని ఆరా తీసి, వారి పేరిట సాయంత్రం మందు పార్టీకి సదరు వర్గం




సన్నాహాలు చేస్తోంది. ఆ రోజు జన్మదినం జరుపుకునే వారిని తాము నిర్ణయిం చిన చోటుకి సాయంత్రం పిలిపించి, వారితో కేకు కోయించి సంబరాలు చేస్తున్నారు. ఆ తర్వాత సంబరాలకు వచ్చిన వారిని మందు, విందుల్లో ముంచి తేల్చుతున్నారు. ఈ మందు పార్టీకి ఓటర్లలో ఎవరిని ఆహ్వానించాలో ఉదయమే నిర్ణయించి, వారికి రహ స్యంగా సమాచారం అందించడమే కాకుం డా, వారంతా తామిచ్చే పార్టీకి కచ్చితంగా హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. ఇందుకు ప్రతిరోజు రూ. 70 వేల నుంచి రూ. లక్ష వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచా రం. దీనికి సంబంధించిన ఖర్చును సదరు వర్గం తరపున పోటీపడే వారు వాటాలు వేసుకొని భరిస్తున్నట్లు తెలుస్తోంది. ఛాంబర్ ఎన్నికలకు పోటీ పడుతున్న వారంతా వ్యాపారులే! వీరంతా తమ పెట్టుబడి మీద 10% నష్టాన్ని కూడా భరిం చడానికి ఒప్పుకోరు. లాభం లేనిదే రూపా యి కూడా ఖర్చు చేయరు. అలాంటిది సదరు వర్గం పార్టీల పేరిట ఎన్నికల నాటికి (నవంబర్ 16) చేసే ఖర్చు దాదాపు రూ.20 నుంచి రూ.25 లక్షల మేర వస్తుందని అంచనా! కేవలం ఛాంబర్ పదవుల కోసం ఈ స్థాయిలో ఖర్చు చేస్తుండటంపై పలు సం దేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో గెలి చి పదవులు దక్కితే, ఆ తర్వాత ఛాంబర్ కు వచ్చే ఆదాయం నుంచి తాము పెట్టిన ఖ ర్చును ఎలాగో ఒకలాగా రాబట్టుకోవచ్చనే భావనలో సదరు వర్గం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఛాంబర్ ను తన గుప్పెట్లో పెట్టుకొని తమ వ్యాపారాలను ఇష్టరీతిన నిర్వహించుకునేందుకే ఈ వ్యవహారమంతా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు వర్గం చేస్తున్న హడావుడి చూస్తుంటే ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ప్యానెల్ నుంచి ప్రధాన పదవులకు పోటీ పడబోతున్న వారి పైన మొదటి నుంచి విమర్శలు ఉన్నాయి. ఈ ప్యానెల్ లోని ఓ వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అక్రమాలకు పాల్పడ్డాడు అనే విమర్శలు ఉన్నాయి. ఇక దీనికి తోడు ఇతరత్రా వర్గాల్లో కాస్త మేనేజ్ చేయగలిగిన వ్యక్తులను చేరదీసి, తన వెంచర్లలో చీకటి వ్యవహారాలు చేయిస్తాడనే ప్రచారం ఉంది. సదరు వ్యక్తి గురించి తెలిసిన కొంతమంది వ్యాపారులు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తుండడం గమనార్హం! ఇక పానెల్ మరో ప్రధాన సీటుకి పోటీ పడబోతున్న ఓ పెద్ద ఖరీదుదారు కమీషన్ వ్యాపారులను పీల్చి పిప్పి చేస్తాడనే ప్రచారం ఉంది. కటింగ్ బిల్లుల వ్యవహారంలో ఊరంతా ఓ పోకడైతే, సదరు వ్యాపారిది మరో దారి. కటింగ్ బిల్లుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాడన్న ప్రచా రం ఉంది. సదరు పెద్ద వ్యాపారి కటింగ్ బిల్లు రేటుని తగ్గిస్తే, మిగతా వ్యాపారులు కూడా తగ్గిస్తారు. దీని వల్ల కమీషన్ వ్యాపారులకు కాస్త ఊరట కలుగుతుంది. కానీ ఈ పెద్ద వ్యాపారి కటింగ్ బిల్లు వ్యవహారంలో కాస్త కూడా పట్టు విడుపు ప్రదర్శించడని సమాచారం. ఇలా అక్రమ వ్యవహారాల్లో పాలు పంచుకునే వ్యక్తి, వ్యాపారుల గురించి కనీసం ప ట్టించుకోని వ్యక్తులు ఛాంబర్ పదవులకు ఎ లా పోటీ చేస్తారని, ఒకవేళ గెలిచినా వ్యాపార వర్గాలకు ఎలా న్యాయం చేస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఇసుక లేక ఆగిన నిర్మాణాలు

**నిజామాబాద్ :** ఇందిరమ్మ ఇళ్లకు జిల్లాలోఇసుక కటకట మొదలైంది. దీంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోతున్నాయి. ఇదే అదనుగా భావించిన కొందరు ఇసుక మాఫియా అదిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్నారు. మంజీరా నీరు ప్రవహిస్తుండడంతో ఇసుక తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి ఇసుకను తరలిస్తున్న మంటూ కొందరు అక్రమంగా పర్మిషన్లు తీసుకుని ఇసుకను తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.అధికారులు మాత్రం పట్టించుకో వడం లేదు. దీంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పూర్తి చేయకుండా మధ్యలోనే నిలిపివేస్తున్నారు. మరోపక్క ఉన్నతాధి కారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చురుకుగా చేపట్టాలని కోరుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక లభించక ఇండ్లను మధ్యలోనే నిలుపుదల చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని నస్రుల్లాబా దులో పలువురు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పనులు నిలుపుదల చేశారు. ఇసుక అధిక ధరలకు విక్రయిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.అధికారులకు తెలిపిన పట్టించుకో వడంలేదని లబ్ధిదారులు తెలిపారు. ఇసుక అక్రమంగా తరలించి ట్రిప్పుకు 5000 నుంచి 6000 రూపాయలకు విక్రయిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. స్థానికా అధికా రులతో కుమ్మక్కై ఇసుక దందా నిర్వహించే నిర్వాహకులు అధిక ధరలకు విక్రయిస్తుండడంతో ఇందిరమ్మ లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం మధ్యలోనే నిలుపుదల చేస్తున్నారు. ఉన్నతాధి కారులు ఇప్పటికైనా స్పందించి అక్రమంగా అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకొని లబ్ధిదారుల కు తక్కువ ధరకు తీసుకొని ఇప్పించాలని కోరుతున్నారు.

## కాంగ్రెస్‌కు జూబ్లీహిల్స్ ఓటర్లు బుద్ధి చెబుతారు

-మొదటిపేజీ తరువాయి

అధికార పార్టీకి తొత్తులుగా మారిపోయారని విమర్శించారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. అధికార పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా జూబ్లీహిల్స్ ఓటర్లు తెలివైన వారు అని.. తగిన రీతిలో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న అన్ని విషయాలను ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలను ఈసీకి అందజేసి.. ఆయా బూత్‌ల్లో కేంద్ర బలగాలను పెట్టాలని కోరామన్నారు. ముఖ్యంగా మహిళా పోలీసు అధికారులు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లను నియమించి, లోపలికి వెళ్లే ఓటర్ల ఐడెంటిటీని గుర్తించాలని.. ఆ తర్వాతే వారిని పోలింగ్ బూత్‌లోకి అనుమతించాలని కోరామని తెలిపారు. ఓటర్ ఐడీ గుర్తించకుండా ఓటర్లను పోలింగ్ బూత్‌లకు పంపించకూడదని సూచించారు.

మహిళా ఓటర్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఈసీని కోరామని హరీశ్‌రావు తెలిపారు. చాలావరకు ఫేక్ ఓటర్ ఐడీలను తయారుచేశారని.. దానికి సంబంధించిన వీడియోను ఎన్నికల ప్రధాన అధికారికి సమర్పించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగం, ఫేఖ్ ఐడీ కార్డుల వివరాలను ఎలక్షన్ అబ్జర్వర్లకు కూడా అందజేశామని పేర్కొన్నారు. తొత్తులుగా మారిన అధికారులపై తప్పకుండా చర్యలు చేపడతామని సీఈవో హామీ ఇచ్చారని తెలిపారు.

అధికారంలోకి వచ్చిన ఈ రెండేండ్లలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై రివ్యూ పెట్టలేదని.. ఇవాళ వాటిపై రివ్యూ పెట్టడం ఎందుకు అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మొదటి అసెంబ్లీలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని ఆయన గుర్తుచేశారు. వాళ్లు అధికారంలోకి వచ్చాక ఎన్నోసార్లు కేబినెట్ సమావేశం జరిగిందని.. అసెంబ్లీ జరిగిందని తెలిపారు. కానీ ఈ ఆరు గ్యారంటీలపై ఏనాడూ రివ్యూ చేయలేదని అన్నారు. ఇప్పుడు ఆరు గ్యారంటీలపై రివ్యూ చేయడం జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేయడం కోసమే అని అన్నారు. జూబ్లీహిల్స్‌లో ఓటమి భయంతోనే సీఎం రేవంత్ రెడ్డి మోకాళ్లపై తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దివాలాకోరు రాజకీయాలు ప్రజలకు అర్థమయ్యాయని అన్నారు. రేవంత్ రెడ్డి ఎన్ని డ్రామాలు ఆడినా కాంగ్రెస్‌ను ఓడించాలని జూబ్లీహిల్స్ ఓటర్లు ముందే నిర్ణయించుకున్నారని వ్యాఖ్యానించారు.

## తెలంగాణ స్పీకర్‌పై సుప్రీంకోర్టులో కోర్టుధిక్కార పిటిషన్

-మొదటిపేజీ తరువాయి

కావాలని కోరుతూ స్పీకర్ కార్యాలయం సైతం ఇప్పటికే సుప్రీంకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు చేయడం గమనార్హం. ఈ క్రమంలో, తమ ధిక్కార పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని బీఆర్ఎస్ తరపు న్యాయవాది మోహిత్ రావు కోరారు. తమ కేసు విచారణకు రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన చీఫ్ జస్టిస్ గవాయ్... "నేను ఈ నెల 23న పదవీ విరమణ చేస్తున్నాను. ఆ తర్వాత నవంబర్ 24 నుంచి సుప్రీంకోర్టుకు సెలవులు" అని వ్యాఖ్యానించారు. వాదనలు విన్న అనంతరం, ఈ పిటిషన్‌పై విచారణను వచ్చే సోమవారం చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది. దీంతో బీఆర్ఎస్ పిటిషన్‌తో పాటు స్పీకర్ కార్యాలయం వేసిన అదనపు పిటిషన్‌పై కూడా సోమవారం విచారణ జరగడం ఖాయమైంది.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్: కిషన్‌రెడ్డి

**సికింద్రాబాద్:** శంషాబాద్ విమానాశ్రయం మాదిరిగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దాలనేది తన ఆకాంక్ష అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం.. మీడియాతో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను మెట్రో మార్గంతో అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. " రూ.715 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు సాగుతున్నాయి. స్టేషన్‌ను 1.65 లక్షల చ.మీ మేర కొత్తగా నిర్మిస్తున్నాం. ఈ స్టేషన్‌కు నిత్యం 1.97లక్షల ప్రయాణికులు వస్తుంటారు. 2.70లక్షల మంది ప్రయాణికుల అవసరాలకు తగినట్లు నిర్మిస్తున్నాం. నడుస్తున్న రైళ్లు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పనులు చేయాల్సి వస్తోంది. ఈ స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఉంటాయి. రైల్వేస్టేషన్ కోసమే ప్రత్యేకంగా 2 సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోంది. 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు కూడా ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే ఏడాది డిసెంబర్‌లోపు ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆధునిక సికింద్రాబాద్ స్టేషన్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం"అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## 3 పార్టీలకు టెన్షన్

-మొదటిపేజీ తరువాయి

పనిచేస్తున్న వ్యక్తులు కాదు. వారంతా జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను అంచనా వేయడానికి ప్రధాన కారణం.. డబ్బు.. అలాగని వారికి ఇక్కడ ఓట్లు కూడా లేదు. ఇక్కడికి రావడానికి, క్షేత్రస్థాయిలో పర్యటించడానికి.. పార్టీల గురించి వాకబు చేయడానికి ప్రధానమైన కారణం ఒకటుంది.జూబ్లీహిల్స్ ప్రాంతంలో అనేక హోటల్స్.. లాడ్జిలలో చాలామంది దిగడానికి ప్రధాన కారణం బెట్టింగులు వేయడమే.. ఇక్కడ ఎవరు గెలుస్తారు? ఏ పార్టీ ఓడిపోతుంది? గెలిచే పార్టీ అభ్యర్థికి ఎంత మెజారిటీ వస్తుంది? అనే అంశాల మీద బెట్టింగులు జోరుగా సాగుతున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ మీద భారీగా బెట్టింగులు నడుస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే క్రమంలో గులాబీ పార్టీ అభ్యర్థి సునీత విజయం సాధించే అవకాశాలు లేకపోలేదని.. ఆమె గెలుపు మీద కూడా భారీగా బెట్టింగులు నడుస్తున్నట్టు సమాచారం. అందువల్లే వారంతా కూడా జూబ్లీహిల్స్ ప్రాంతంలో కొద్దిరోజులుగా తిష్ట వేసినట్టు తెలుస్తోంది.. ఓ అంచనా ప్రకారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికలపై దాదాపు 300 నుంచి 400 కోట్ల వరకు బెట్టింగులు నడుస్తున్నట్టు తెలుస్తోంది.. కొంతమంది ప్రత్యేక ముఠాగా ఏర్పడి ఏ వ్యవహారం సాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఈముఠా సభ్యులు ఎప్పటికప్పుడు సర్వే చేయించుకుని.. దాని ఆధారంగా బెట్టింగ్లు సాగిస్తున్నట్టు తెలుస్తోంది.జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో నేటితో ప్రచారం ముగుస్తుంది. మంగళవారం పోలింగ్ ప్రారంభమవుతుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం భారీగా ఏర్పాట్లు చేసింది.. నేటి సాయంత్రం నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే దాకా ఇక్కడ వైన్ షాపులను బంద్ చేస్తారు. బయట వ్యక్తులను స్థానికంగా ఉండకుండా బయటికి పంపించేస్తారు.

**మాటల తూటాలు..**

ఉప ఎన్నికలను అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. సిట్టింగ్ స్థానం నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్, అధికారంలో ఉన్నాం కాబట్టి గెలిచి తీరాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉన్నాయి. ఇక ఇక్కడ సత్తాచాటి తెలంగాణలో నెక్ట్స్ బీజేపీదే అని సంకేతం ఇవ్వాలని బీజేపీ ఉవ్విళ్లూరుతున్నాయి. మూడు పార్టీల నాయకుల ప్రచారం చివరి రోజు ప్రత్యర్థులపై మాటల తూటాలతో దండయాత్ర చేస్తున్నారు. అభ్యర్థుల విజయాన్ని పార్టీ ప్రతిష్టగా మార్చుకోవాలన్న ఉద్దేశ్యంతో ప్రచారం పీక్‌కు చేరింది.

పోలింగ్‌కు సమయం దగ్గరపడుతున్న కొద్దీ అభ్యర్థులు ప్రతి ఓటరిని వ్యక్తిగతంగా చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. స్వీయ అభివృద్ధి వాగ్దానాలు, స్థానిక సమస్యల పరిష్కార హామీలు, మత?జాతి ప్రాతిపదికన కాకుండా అభివృద్ధి రహదారిగా తామే నిలుస్తామన్న ప్రచారం తారస్థాయికి చేరింది. ప్రచార సమయం ముగిసిన వెంటనే హైదరాబాద్ పోలీసు బలగాలు ఎలక్షన్ కోడ్ అమలులోకి దిగి కఠిన పర్యవేక్షణ మొదలుపెట్టనున్నాయి. పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆదేశాల ప్రకారం ఆదివారం సాయంత్రం ఆరు గంటల నుంచి నవంబర్ 11న సాయంత్రం ఆరు గంటల వరకు వైన్స్ షాపులు, బార్లు మూసివేస్తారు.ప్రచారం ముగిసిన వెంటనే ప్రలోభాలకు తెరతీయనున్నారు. ప్రచారంలో చివరి రోజు ర్యాలీలు, పాదయాత్రలు చేశారు. రాత్రి నుంచే డబ్బుల పంపిణీకి సిద్ధమవుతున్నారు. దీనిని అడ్డుకునేందుకు పోలీసులూ వ్యూహం రూపొందిస్తున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి





**ధర్మఘంట, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 10:**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన బచ్చలి ప్రవీణ్ కుమార్ మండలంలోని తుర్కపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణంలోని రడగంబాల బస్తీకి చెందిన ఇల్లందుల రాజమణి తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ తన దరఖాస్తులో అడ్డా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. చెన్నూరు మండలం ఆస్నాద్ గ్రామానికి చెందిన రామిళ్ళ ప్రమీల తనకు 2013లో ప్రభుత్వం భూమికి పట్టా ఇచ్చిందని, ఇట్టి పట్టాను డిజిటలైజ్ చేసి నూతన పట్టా పాస్ పుస్తకం మంజూరు చేసి తనకు భూమిని చూపించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గవ్వల శంకరయ్య మండలంలోని రెబ్బెనపల్లి గ్రామ శివారులో తన తల్లి నుండి వారసత్వం గా వస్తున్న భూమికి పట్టా మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం లోని అశోక్ రోడ్ ప్రాంతానికి చెందిన బెజ్జంకి రమ తన భర్త కంచరీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించే వారిని, తనకు పక్షవాతం రావడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, భర్తకు పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన ఆసరి రాజలక్ష్మి నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కాసర్ల శ్రీనివాస్, మంచు శంకర్ లు తమ దరఖాస్తులో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని, ప్రతి నెల సదరం శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషిచేసి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలి

## రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

**ధర్మఘంట, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 10:**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పత్తి, వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాలు, వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని, ఇందులో భాగంగా రైతులు సాగుచేసిన పంటను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పత్తి, వరి కొనుగోలు ప్రక్రియ రాష్ట్రంలో సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేపట్టాలని, సరిహద్దుల వద్ద అక్రమ రవాణాను అరికట్టాలని తెలిపారు. 2025%-%26 ఖరీఫ్ సీజన్ పంటలైన వరి, మక్కజొన్న, పత్తి కొనుగోలు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకువచ్చే సమయంలో పాటించవలసిన నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించాలని, రైతుల వివరాలు స్పష్టంగా ట్యాబ్ లలో నమోదు చేసి చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేయాలని





తెలిపారు. రాష్ట్రంలో 8 వేల 450 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో 6 వేల 838 కేంద్రాలు ఇప్పటికే ప్రారంభించామని, ఇంకా 1 వేయి 614 కేంద్రాలు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. అధికారుల సూచనల ప్రకారం నవంబర్ 3 , 4 వారాలు కీలక సమయంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ముందుగా పంటల కొనుగోలుకు సంబంధించి నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అధికారులు వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తూ, కొనుగోలు ప్రక్రియ వేగంగా చేయాలని, రైతులకు చెల్లింపులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూలీల లభ్యత, రవాణా సమస్యలు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు, తేమ శాతం నియంత్రణ చర్యలు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని, పంటలను సమయానికి కొనుగోలు చేయడానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుందని, సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తుందని, కౌలుదారు రైతుల సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నాణ్యమైన పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలులో రైతుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 150, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 97, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో 63, మెప్మా ఆధ్వర్యంలో 7 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సన్న రకం వడ్లకు బోనస్ ఇస్తున్నందున అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ వీరభద్రరావు మనవడు వికాస్ రిసెప్షన్ వేడుకలు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కోల్ బెల్ట్ ప్రముఖులు

**ధర్మఘంట, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 10:**

సింగరేణి కాంట్రాక్టర్ దివంగత కోనేరు వీరభద్రరావు మనవడు కోనేరు వికాస్, నవ్యసాయి రిసెప్షన్ వేడుకలు ఆదివారం విజయవాడ నగరంలోని ఏ కన్వెన్షన్‌లో అట్టహాసంగా జరిగాయి. కోనేరు (వీరభద్రరావు ట్రాన్స్‌పోర్ట్) పేరుతో సింగరేణి ప్రాంతంలో ప్రసిద్ధుడైన కాంట్రాక్టర్ వీరభద్రరావు, వెంకటరమణమ్మ ల మనవడు, కోనేరు దుర్గప్రసాద్ రావు, శ్రీదేవి దంపతుల ద్వితీయ కుమారుడు కోనేరు వికాస్ వివాహం గన్నవరం నివాసి జాస్తి శరత్ బాబు, కవితల పెద్ద కుమార్తె నవ్యసాయి తో శుక్రవారం వివాహం జరిగిన నేపథ్యంలో ఆదివారం విజయవాడలో రిసెప్షన్ వేడుకలను కుటుంబ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ రాష్ట్ర మంత్రి బోడ జనార్ధన్, సింగరేణి వ్యాప్తంగా గల పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, సింగరేణి అధికారులు, ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్ల సంఘం నాయకులు, పలువురు వ్యాపారవేత్తలు, మందమర్రి పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ రిసెప్షన్ వేడుకల్లో సందర్భంగా వీరభద్ర రావు కుటుంబీకులు ఆయన సతీమణి వెంకటరమణమ్మ, కుమారుడు, కోడలు కోనేరు ప్రసాద్ బాబు, శ్రీదేవి, మనవళ్లు డాక్టర్ ఫణికుమార్, కృష్ణకాంత్ లు కుటుంబ సభ్యులతో కలిసి అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించి, అతిథి సత్కారాలను అందించారు. పూలతో, దీప కాంతు వెలుగుల్లో నయనానందకరంగా రిసెప్షన్ ప్రాంగణం అతిథులను విశేషంగా ఆకర్షించింది.

**వీరభద్రరావు పై అభిమానాన్ని చాటిన కోల్ బెల్ట్ ప్రాంత ప్రజలు**

కోనేరు వీరభద్రరావు వీరభద్రరావు ట్రాన్స్ పోర్ట్ పేరుతో



సింగరేణి ప్రాంతంలో సుప్రసిద్ధ కాంట్రాక్టర్. ఆయన గత సంవత్సర క్రితం మృతి చెందగా, నేడు విజయవాడలో నిర్వహించిన ఆయన మనవడు వికాస్ వివాహ వేడుకల్లో సింగరేణి ప్రాంతం నుండి అధిక సంఖ్యలో అతిథులు హాజరై, వీరభద్రరావు పై వారికున్న అభిమానాన్ని చాటారు. కోల్ బెల్ట్ ప్రాంతంలో కోల్ ట్రాన్స్ పోర్ట్ లో వీరభద్రరావు ప్రత్యేక స్థానాన్ని పొందగా, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఎంతోమంది ట్రాన్స్ పోర్ట్ రంగంలో అడుగుపెట్టి, ఆయన సలహాలు, సూచనలతో ఆ రంగంలో రాణించారు. ఆ సమయంలో వీరభద్రరావు కు సింగరేణి ప్రాంతంలోని ప్రభుత్వ, సింగరేణి అధికారులు, ప్రజాప్రతినిధులతో సన్నిహిత సంబంధాలు కలవు. విజయవాడ వాస్తవ్యుడైన వీరభద్రరావును మందమర్రి పట్టణం తోపాటు సింగరేణి ప్రాంత ప్రజలు తమ సొంత మనిషిలా భావిస్తారు. తన ట్రాన్స్ పోర్ట్ తోపాటు వివిధ వ్యాపారాల్లో ఈ ప్రాంతంలోని అనేక మంది యువకులకు ఆయన ఉద్యోగ అవకాశాలు కల్పించి, చేరదీశారు. అదేవిధంగా ఎంతోమందికి సహాయార్థులకు సహాయం అందించారు. గత సంవత్సరం ఆయన మరణ వార్త సింగరేణి వ్యాప్తంగా ప్రజలను శోక సముద్రంలో ముంచగా, అనే దశదిన కర్మ, వర్ధంతి కార్యక్రమాలకు మందమర్రి, సింగరేణి ప్రాంతల నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన ఆయన మనవడు వికాస్ వివాహానికి సైతం సింగరేణి ప్రాంత ప్రజలు వీరభద్రరావు పై గల అభిమానాన్ని చాటుతూ, ఆ వివాహ వేడుకలు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించి, వీరభద్రరావుతో వారికున్న పరిచయాన్ని మరోమారు గుర్తుచేసుకున్నారు.

## నెరవేరనున్న మంచిర్యాల ప్రజల చిరకాల ఆకాంక్ష

**ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి మంజూరు**

**ధర్మఘంట, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 10:**



జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో సికింద్రాబాద్ - బల్లార్షా రైలు మార్గంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి మంజూరు కావడంతో మంచిర్యాల ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరానుంది. సికింద్రాబాద్ - బల్లార్షా రైలు మార్గంలో కాజీపేట వైపు ఎలక్ట్రిక్ ఫోల్ నెంబర్ 261/12 వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబి) ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ రైల్వే అధికారిని అశ్విని వైష్ణవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం లను లేఖ ద్వారా కోరగా, స్పందించిన రైల్వే శాఖ అధికారులు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి, ఎఫ్ఓబి నిర్మాణానికి సోమవారం అనుమతి మంజూరు చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, ఈ ఎఫ్ఓబి నిర్మాణం పూర్తయితే మంచిర్యాల పట్టణంలోని హమాలివాడ, సూర్య నగర్, తిలక్ నగర్, రాజీవ్ నగర్, గోపాలవాడ, సప్తగిరి కాలనీ, అశోక్ రోడ్, వేముల బస్తీ, దొరగారిపల్లె తదితర ప్రాంత ప్రజలకు రాకపోకలు ఎంతో సులభతరం కానున్నాయని తెలిపారు. ఈ వంతెన నిర్మాణం పనులు వచ్చే ఏడాది డిసెంబర్ లోపే పూర్తవుతాయన్నారు. ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని తీసుకున్న ఈ నిర్ణయం మంచిర్యాల పట్టణ అభివృద్ధికి మరో ముందడుగు అవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు త్వరగా పూర్తై ప్రజలకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

## లోక్ అదాలత్ తో సత్వర న్యాయం

**రాజీ మార్గమే రాజమార్గం**

**15న ప్రత్యేక లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి**

**మందమర్రి సిఐ కే శశిధర్ రెడ్డి**

**ధర్మఘంట, మందమర్రి నవంబర్ 10:**




రాజీ మార్గం రాజా మార్గమని, కక్షలు, కార్పణ్యాలతో ఏమీ సాధించలేమని, రాజీపడితే ఇద్దరూ గెలిచినట్లేనని మందమర్రి సిఐ కే శశిధర్ రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. నవంబర్ 15న జరుగనున్న ప్రత్యేక లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలాన్ని, ధనాన్ని వృధా చేసుకోవడం కంటే సామరస్యం నిండిన రాజీమార్గమే అత్యుత్తమం అని తెలిపారు. లోక్ అదాలత్ తో సత్వర న్యాయం జరుగుతుందన్నారు. రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. రాజీ మార్గం రాజా మార్గమని, చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని, కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్ తో బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని తెలిపారు. క్షణికావేశంలో నమోదు చేసుకున్న చిన్న చిన్న కేసులు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, చెక్ బౌన్స్, చిన్నపాటి సివిల్ తగాదాలు వంటి రాజీ పోవుటకు అవకాశం ఉన్న కేసులను న్యాయస్థానం పరిధిలో స్వచ్ఛందంగా రాజీ కుదుర్చుకోవడంతో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చునని, ఈ ప్రక్రియలో న్యాయం తక్కువ సమయంలో లభించడమే కాకుండా ఇరుపక్షాల మధ్య సయోధ్య కుదిరి, సంబంధాలు శాశ్వతంగా మెరుగుపడతాయని, న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ, ఖర్చు పూర్తిగా ఆదా అవుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని మందమర్రి సర్కిల్ పరిధిలోని మందమర్రి, రామకృష్ణాపూర్, కాసీపేట, దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలందరూ వినియోగించుకొని, లోక్ అదాలత్ లో పాల్గొని తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకొని, న్యాయం పొందాలని కోరారు.


## తుర్కపల్లిలో మినీ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయలి

**తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్**

**ధర్మఘంట, మందమర్రి నవంబర్ 10:**




మండలంలోని సారంగపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తుర్కపల్లి ప్రభుత్వ పాఠశాలలో మినీ అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, మండలంలోని తుర్కపల్లి గ్రామంలో చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పౌష్టికాహారం, ప్రాథమిక సేవల కోసం మినీ అంగన్వాడి కేంద్రం అత్యవసరమని తెలిపారు. గ్రామస్థులు అంగన్వాడీ సేవల కోసం కిలో మీటర్ దూరంలో ఉన్న సారంగపల్లి గ్రామానికి వెళ్లవలసి వస్తోందని, దీంతో గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లల తల్లులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా గ్రామస్థులకు సమయానుకూలంగా అంగన్వాడీ సేవలు అందడం లేదన్నారు. తుర్కపల్లి ప్రభుత్వ పాఠశాలలో విశాలమైన స్థలం, మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేస్తే గ్రామస్థులకు పౌష్టికాహారంతో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందుబాటులో ఉంటుందన్నారు.



# మూగబోయిన తెలంగాణ, జాతి గుండె చప్పుడు అందెశ్రీ

**ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ కన్నుమూశారు**
**ఆయన అస్వస్థతకు గురవడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు**
**ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ అందెశ్రీ తుదిశ్వాస విడిచారు**







ధర్మఘంట హైదరాబాద్, నవంబర్ 10

జయ జయహే తెలంగాణ' అంటూ తెలంగాణకు రాష్ట్రీయ గీతాన్ని అందించిన గొంతు మూగబోయింది. 'జనజాతరలో మన గీతం జయకేతనమై ఎగరాలి' అని తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన గొంతు ఈరోజు ఊపిరిని వదిలేసింది. ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ (64) (%ూాఅఎవ ంతీఱ%) కన్నుమూశారు. ఆయన ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఈ క్రమంలోనే కుటుంబ సభ్యులు ఆయనను హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నేడు (సోమవారం) తుది శ్వాస విడిచారు. ఈరోజు ఉదయం7:25 నిమిషాలకు మరణించినట్లు గాంధీ ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు.

ప్రఖ్యాత కవి మరియు గేయ రచయిత అందెశ్రీ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడీ సంతాపం తెలిపారు, వారి పోరాటాలు, ఆకాంక్షలు మరియు అచంచలమైన స్ఫూర్తిని వ్యక్తీకరించిన ప్రజల గొంతుకగా ఆయనను గుర్తు చేసుకున్నారు.

"అందెశ్రీ మరణం మన సాంస్కృతిక మరియు మేధో దృశ్యంలో లోతైన శూన్యతను మిగిల్చింది. ఆయన ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబించాయి. ఫలవంతమైన కవి మరియు ఆలోచనాపరుడు, అతను ప్రజల గొంతు, వారి పోరాటాలు, ఆకాంక్షలు మరియు అచంచలమైన స్ఫూర్తిని వ్యక్తపరుస్తాడు" అని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

తెలంగాణ సాహితీ శిఖరం, ప్రజాకవి అందెశ్రీ మృతి తీవ్ర దిగ్భ్రాంతిని, దుఃఖాన్ని కలిగించింది. ఆయన మృతి సాహితీ లోకానికే కాకుండా వ్యక్తిగతంగా నాకు కూడా తీరని లోటు.. తెలంగాణ ఉద్యమంలో తన మాటలను ఇంధనంగా మార్చిన మహాయోధుడు అందెశ్రీ.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతం "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" అనే గీతం చిరస్థాయిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది' అని పేర్కొన్నారు. "హృదయాలను కదిలించే, స్వరాలను ఏకం చేయగల మరియు సమాజంలోని సామూహిక పల్స్‌కు రూపాన్ని ఇచ్చే శక్తి అతని మాటలకు ఉంది. అతను సాహిత్య సౌందర్యంతో సామాజిక స్పృహను మిళితం చేసిన విధానం అత్యద్భుతం. నా ఆలోచనలు అతని కుటుంబం మరియు అభిమానులతో ఉన్నాయి. ఓం శాంతి" అని ఆయన చెప్పారు.

అందెశ్రీ మృతి తెలంగాణ సాంస్కృతిక, సాహిత్య చైతన్యానికి తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల పక్షాన నిలిచిన నిజమైన నేల పుత్రుడు.. అఖండ కవి.. ఆయన మాటలు తెలంగాణ ఉద్యమానికి గుండెకాయలా నిలిచాయి. జయజయహే తెలంగాణ జననీ జయకేతనం' ద్వారా తెలంగాణ ప్రజల గర్వాన్ని ఎప్పటికీ చాటిచెప్పే రాష్ట్ర గీతాన్ని కానుకగా అందించారు. ఆయన కుటుంబ సభ్యులకు, మిత్రులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

ప్రముఖ కవి, గేయ రచయిత అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జయ జయహే తెలంగాణ అంటూ తెలంగాణ రాష్ట్ర గీతాన్ని రచించిన అందెశ్రీ మృతి తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు అని అన్నారు. అందెశ్రీ అధికారిక గీతం ప్రజలకు ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు.

తెలంగాణ సాహితీ శిఖరం, ప్రజాకవి అందెశ్రీ మృతి తీవ్ర దిగ్భ్రాంతిని, దుఃఖాన్ని కలిగించింది.ఆయన మృతి సాహితీ లోకానికే కాకుండా వ్యక్తిగతంగా నాకు కూడా తీరని లోటు.. తెలంగాణ ఉద్యమంలో తన మాటలను ఇంధనంగా మార్చిన మహాయోధుడు అందెశ్రీ.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతం "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" అనే గీతం చిరస్థాయిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది' అని పేర్కొన్నారు. మనుషుల్లో మానవత్వాన్ని తట్టి లేపిన తెలంగాణ ప్రజల గుండెచప్పుడు, తెలంగాణ సాహితీ శిఖరం, లోక కవి అందెశ్రీ మరణం తెలంగాణ ప్రాంతానికి జాతికి తీరని లోటుగా భావిస్తూ అందెశ్రీ కి కన్నీటి జోహార్లు అర్పిస్తూ అందెశ్రీ పార్థివ దేహాన్ని సికింద్రాబాద్ నియోజకవర్గంలో లాలాపేట లోని ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణంలో అభిమానుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ప్రజలు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున తరలివచ్చి అందెశ్రీ పార్థివ దేహాన్ని సందర్శిస్తున్నారు. అదే విధంగా అందెశ్రీ అంత్యక్రియలు లాలాపేట జయశంకర్ ప్రాంగణం నుంచి ఘట్కేసర్ వరకు రేపు ఉదయం 9:00 గం?? నుంచి ర్యాలీ ఉంటుంది. ఆ ర్యాలీలో ప్రజలందరూ పాల్గొనాలని కన్నీటి జోహార్లు అర్పించాలని తెలంగాణ దళిత సంఘాల ఐక్యవేదిక, మాదిగ అనుబంధ కులాల ఐక్యవేదిక, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కోరారు.

**హలో ఉస్మానియా చలో లాలాపేట**

తెలంగాణ కవి రచయిత్ర అందెశ్రీ అకాల మరణాన్ని తెలంగాణ సమాజం దిగ్భ్రాంతకి గురి అయింది. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు ప్రొఫెసర్లు టీచింగ్ నాన్ టీచింగ్, తెలంగాణ సమాజం అందెశ్రీ అంతక్రియలో పాల్గొని ఘన నివాళి అర్పిద్దామని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి అన్నారు.

లాలాపేట లోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో తేదీ 11:11:2025 ఉదయం 8:00 కి పార్థివ దేహాన్ని సందర్శించాలని. ఘట్కేసర్ లో ప్రభుత్వ లాంఛనాలతో అందెశ్రీ అంతక్రియలు జరగనున్నాయని ఆయన తెలిపారు.

**అందెశ్రీ ప్రస్థానం ..**

1961 జూలై 18న సిద్దిపేట జిల్లా రేబర్తిలో జన్మించారు.
అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య.
అందెశ్రీకి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.
జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతం రచించారు.
తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు.
ఇటీవల రూ.కోటి పురస్కారం తెలంగాణ ప్రభుత్వం అందించింది.
కాకతీయ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.
అశువు కవిత్వం చెప్పడంలో అందెశ్రీ దిట్ట.
2006లో గంగ సినిమాకు అందెశ్రీకి నంది పురస్కారం పొందారు.
2014లో అకాడమిఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్ సాధించారు.
2015లో దాశరథి సాహితీ పురస్కారం అందుకున్నారు.
2015లో రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం తీసుకున్నారు.
2022లో జానకమ్మ జాతీయ పురస్కారం సాధించారు.
2024లో దాశరథీ కృష్ణమాచార్య సాహితీ పురస్కారం పొందారు.
లోక్ నాయక్ పురస్కారం అందుకున్నారు.

# తలాపాపం చెరో పిడేకెడు అన్నట్లుగా భూమి అన్యాక్రాంత అంశం


**జగిత్యాలలో భూ వివాదం పై పారదర్శక విచారణ జరపాలి.**
**ఆక్రమణ జరిగితే తక్షణమే ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలి.**
**మున్సిపల్, రెవెన్యూ విభాగాలా నిర్లక్ష్యం వల్లనే ఈ దుస్థితి.**
**ఈ అంశం పై అవసరం అయితే సీఎస్‌ని కలిసి విజ్ఞప్తి చేస్తాం**
**జిల్లా పరిషత్ తొలి ఛైర్ పర్సన్ దావ వసంత**




**జగిత్యాల :** జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో వంద కోట్ల భూమి కబ్జా అయ్యిందని వస్తున్నా ఆరోపణలు, పత్రిక కథనలపై అధికార గణం తక్షణమే స్పందించి వివాదం పై పారదర్శక విచారణ జరిపించాలని జగిత్యాల జిల్లా పరిషత్ తొలి ఛైర్ పర్సన్ దావ వసంత- సురేష్ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కి వెళ్లి అదనపు కలెక్టర్ లత కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వసంత మాట్లాడుతూ గత 70 ఏళ్ల నుండి సమస్య ఉన్న అధికారుల నిర్లక్ష్యం వల్ల వందల కోట్ల ఎకరాల భూమి ప్రభుత్వం నుండి వెళ్లి వ్యక్తుల చేతిలో బంధీ అయ్యిందని విమర్శించారు. జగిత్యాల లోని 138 సర్వే నెంబర్ లో ఉన్న భూమి విషయం చుస్తే తలా పాపం చేరో పిడికెడు అన్నట్టుగా ఉందని విమర్శించారు. ప్రజల ఆస్తి ప్రజలకే చెందాలనే కేసీఆర్ స్ఫూర్తి తో బీఆర్ఎస్ పక్షాన ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఆనాడు అక్రమ నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది ఎవరు? ఈ విషయం పై మున్సిపల్ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో సమాధానం చెప్పాలని వసంత డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆస్తిని నిబంధనలకు విరుద్ధంగా ధారాదత్తం చేయడంలో భాగం ఉన్న ప్రతి అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవహారం అంత కిభాల చుట్టే తిరుగుతుందని, కిభాల ప్రతిని ట్రాన్స్ లేట్ చేయించి వాస్తవాలను బయటపెట్టాలన్నారు.విచారణలో భూ అక్రమాలు జరిగితే భూమిని స్వాదీనం చేసుకోవడంతో పాటుగా బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వసంత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ అంశం ఇక్కడితోనే ఆగదని, హై కమాండ్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి వారి సహకారంతో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని కలిసి విజ్ఞప్తి చేస్తామని వసంత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దేవేందర్ నాయక్,బీఆర్ఎస్ నాయకులు శీలం ప్రవీణ్, నాచుపెల్లి రెడ్డి, అనురాధ, నక్క గంగాధర్, రిజ్వాన్, నీలి ప్రతాప్, గంగిపెల్లి వేణుమాధవ్, గాజుల శ్రీనివాస్, మధుకర్,ప్రణయ్,భగవాన్ రాజ్ కోటగిరి మోహన్,నవదీప్, జవీద్ పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.














# బిజినెస్

## 875 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం దిశగా సాగుతున్నాం



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 875 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించే దిశగా సాగుతున్నామని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) సనోజ్ కుమార్ ఝూ తెలిపారు. గత 2 నెలల్లో కోల్ ఇండియా ఉత్పత్తి లక్ష్యాన్ని చేరని నేపథ్యంలో.. హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ 59వ వ్యవస్థాపక దినోత్సవంలో సనోజ్ ఇలా పేర్కొనడం గమనార్హం. వర్షాల వల్లే గత 2 నెలల్లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరలేదని వివరించారు. విద్యుదుత్పత్తి యూనిట్ల నుంచి బొగ్గుకు గిరాకీ తగ్గిందన్నారు. పరిశ్రమల అవసరాలకు సరిపడా బొగ్గు సరఫరా చేయగలమని స్పష్టం చేశారు. ఏడాది చివరకు బొగ్గు నిల్వలు చూస్తే, గతేడాది కంటే అధికంగా ఉంటాయని పేర్కొన్నారు.

## ఒలెక్ట్రాకు రూ.49.5 కోట్ల లాభాలు





ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఓజీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 4.2 శాతం వృద్ధితో రూ.49.5 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.47.6 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2025-26 క్యూ2 ఫలితాలకు ఆ కంపెనీ బోర్డు శనివారం ఆమోదం తెలిపింది. ఈ త్రైమాసికంలో ఒలెక్ట్రా రెవెన్యూ 25.4 శాతం పెరిగి రూ.657 కోట్లకు చేరింది. 2024-25 ఇదే త్రైమాసికంలో రూ.524 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. అయితే మార్జిన్లు మాత్రం 15.5 శాతం నుంచి 13.6 శాతానికి తగ్గాయి. గడిచిన క్యూ2లో 375 వాహనాలను డెలివరీ చేసి నూతన మైలు రాయిని సాధించినట్లు ఒలెక్ట్రా తెలిపింది. ఇప్పటివరకు 3254 వాహనాలు డెలివరీ చేయటంతో పాటు 9818 వాహనాల ఆర్డర్ బుక్‌తో భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది వేసుకుంది. 'ఒక త్రైమాసికంలో అత్య ధికంగా 375 ఎలక్ట్రిక్ వాహనాలు, అందులో 25 ఎలక్ట్రిక్ టిప్పర్లు విజయవంతంగా డెలివరీ చేయడం మాకు గర్వ కారణం. ఆపరేషనల్ సామర్థ్యంపై ఫోకస్ పెట్టడం ద్వారా ఆదాయంలో, లాభంలో గణనీయమైన వృద్ధి సాధించాము. భారతదేశంలో తొలిసారిగా బ్లేడ్ బ్యాటరీ ప్యాక్ సర్టిఫికేషన్ సాధించినందుకు సంతోషిస్తున్నాము." అని ఒలెక్ట్రా మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్ బాబు పేర్కొన్నారు.

# పీపీఎఫ్, సుకన్య సమృద్ధి సహా బెస్ట్ పోస్టాఫీస్ స్కీమ్స్




సంప్రదాయ పెట్టుబడిదారులు పెద్దగా రిస్క్ కోరుకోరు. ఎలాంటి రిస్క్ లేకుండా గ్యారెంటీ రిటర్న్స్ అందించే పెట్టుబడి పథకాలను ఎంచుకుంటారు. ఇక్కడ బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పాటు పోస్టాఫీస్ స్మాల్ సేవింగ్స్ స్కీమ్స్ వంటివి ఉంటాయి. ఇక్కడ నిర్దిష్ట పెట్టుబడి ప్రకారం.. నిర్ణీత కాల వ్యవధికి కచ్చితమైన రిటర్న్స్ అందుకోవచ్చు. ఎలాంటి రిస్క్ ఉండదు. చాలా చిన్న మొత్తాల్లో కూడా ఇక్కడ ఇన్వెస్ట్ చేసేందుకు అవకాశం ఉంటుంది. వీటిల్లో వార్షిక ప్రాతిపదికన 7-8 శాతం మధ్య వడ్డీ రేట్లు ఉన్నాయి. వీటిల్లో నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ నుంచి పీపీఎఫ్ (పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్), సుకన్య సమృద్ధి అకౌంట్, సీనియర్ సిటిజెన్స్ సేవింగ్స్ స్కీమ్ వంటివి బాగా ఆదరణ పొందాయి. పీపీఎఫ్- ఇందులో ప్రస్తుతం వడ్డీ రేటు వార్షిక ప్రాతిపదికన 7.10 శాతంగా ఉంది. ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ. 500 నుంచి గరిష్ఠంగా రూ. 1.50 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇక్కడ ఏడాదిలో ఒకేసారి లేదా ఇన్‌స్టాల్‌మెంట్లలో చెల్లించొచ్చు. ఇక్కడ పాత పన్ను విధానంలో ట్రిపుల్ టాక్స్ బెనిఫిట్స్ ఉంటాయి. పెట్టుబడి, వడ్డీ, మెచ్యూరిటీ రాబడిపై టాక్స్ వర్తించదు. వరుసగా 15 ఏళ్లు ఇందులో ఇన్వెస్ట్ చేయాలి. సుకన్య సమృద్ధి యోజన- ఇందులో వడ్డీ రేటు 8.20 శాతంగా ఉంది. కనీసం ఆర్థిక సంవత్సరంలో రూ. 250 నుంచి గరిష్ఠంగా రూ. 1.50 లక్షల వరకు పెట్టొచ్చు. ఇక్కడ కూడా పన్ను ప్రయోజనాలు పొందొచ్చు. ఇది ఆడపిల్లల కోసమే ఉద్దేశించింది. పాప వయసు పదేళ్లలోపే ఇందులో చేరాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా వరుసగా 15 ఏళ్లు డబ్బులు కట్టాలి. కిసాన్ వికాస్ పత్ర- ఇక్కడ వడ్డీ రేటు 7.5 శాతంగా ఉంది. 115 నెలల్లో పెట్టుబడి కచ్చితంగా డబుల్ అవుతుంది. కనీసం రూ. 1000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. గరిష్ఠ పరిమితి లేదు. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ వడ్డీ రేటు 7.50 శాతంగా ఉంది. ఇక్కడ కనీసం రూ. 1000 నుంచి గరిష్ఠంగా రూ. 2 లక్షల వరకు పెట్టుబడి పెట్టొచ్చు. ఇక్కడ టెన్యూర్ 2 సంవత్సరాలుగా ఉంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్- ఇందులో వడ్డీ రేటు 7.7 శాతంగా ఉంది. ఇక్కడ కూడా గరిష్ఠ పెట్టుబడి పరిమితి లేదు. ఇక్కడ ఐదేళ్ల టెన్యూర్ ఉంటుంది.నేషనల్ సేవింగ్స్ టైమ్ డిపాజిట్ అకౌంట్- ఇక్కడ వడ్డీ రేట్లు వార్షిక ప్రాతిపదికన 6.9 శాతం నుంచి 7.5 శాతంగా ఉన్నాయి. గరిష్ఠ పెట్టుబడి పరిమితి లేదు. ఇక్కడ 1, 2, 3, 5 సంవత్సరాల పరిమితితో ఉంటాయి. సీనియర్ సిటిజెన్స్ సేవింగ్స్ స్కీమ్ విషయానికి వస్తే వడ్డీ రేట్లు 8.20 శాతంగా ఉన్నాయి. ఇక్కడ కనీసం రూ. 1000 నుంచి గరిష్ఠంగా రూ. 30 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇక్కడ కూడా ఐదేళ్ల పరిమితి ఉంటుంది. నిర్దిష్ట వడ్డీ రేటు ప్రకారం.. ప్రతి 3 నెలలకు ఓసారి వడ్డీ వస్తుంది. 60 ఏళ్లు పైబడిన వారు ఇందులో చేరేందుకు అర్హులు.

# అదానీ చేతికి జైప్రకాశ్ అసోసియేట్స్!




జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్)ను దివాలా పరిష్కార ప్రక్రియ ద్వారా కొనుగోలు చేయడంలో విజయవంతమైన బిడ్డర్‌గా నిలిచే అవకాశం అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌కు ఉందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయిదేళ్లలో చెల్లింపులు చేస్తామని వేదాంత బిడ్ వేయగా.. రెండేళ్లలోనే కొనుగోలు మొత్తాన్ని చెల్లిస్తామనే అదానీ ఆఫర్ మెరుగ్గా ఉందని చెబుతున్నారు. వాస్తవానికి సెప్టెంబరు ప్రారంభంలో, జేఏఎల్ రుణదాతలు నిర్వహించిన వేలంలో రూ.12,505 కోట్ల నికర ప్రస్తుత విలువ (ఎన్‌పీవీ) ఆఫర్‌తో వేదాంతా గ్రూప్ ముందు నిలిచింది. తదుపరి వేదాంతాతో పాటు జేఏఎల్ కోసం పోటీపడిన అదానీ, దాల్మియా సిమెంట్ (భారత్) లిమిటెడ్, జిందాల్ పవర్ లిమిటెడ్, పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్‌తోనూ రుణదాతలు చర్చలు జరిపి, బిడ్ విలువ పెంచాలని కోరారు. అక్టోబరు 14న ఈ సంస్థలన్నీ సీలు చేసిన కవర్లలో కొత్తగా పరిష్కార ప్రణాళికలు సమర్పించాయి. వీటిపై చర్చించడానికి, సాధ్యాసాధ్యాలు అంచనా వేయడానికి జేఏఎల్ రుణదాతల కమిటీ (సీఓసీ) గత వారం సమావేశమైంది. మూల్యాంకనం తర్వాత అదానీ ఎంటర్‌ప్రైజెస్ పరిష్కార ప్రణాళికకు అత్యధిక స్కోరు ఇచ్చినట్లు సమాచారం. ఆ తర్వాత దాల్మియా సిమెంట్ (భారత్), వేదాంతా లిమిటెడ్ ఈ రేసులో ఉన్నాయని తెలుస్తోంది. వచ్చే రెండు వారాల్లో పరిష్కార ప్రణాళికను సీఓసీ ఓటింగ్‌కు పెట్టే అవకాశాలున్నాయి. రుణదాతలకు రెండేళ్లలోపు చెల్లింపులు చేస్తామని ఆఫర్ ఇచ్చిన అదానీ గ్రూప్, విజయవంతమైన బిడ్డర్‌గా నిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది.

# సంజూ అవుట్!
# రాజస్తాన్ రాయల్స్ కొత్త కెప్టెన్‌గా అతడే!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫ్రాంఛైజీ రాజస్తాన్ రాయల్స్‌తో టీమిండియా స్టార్ సంజూ శాంసన్ బంధం ముగిసినట్లు తెలుస్తోంది. పదకొండు సీజన్లుగా రాజస్తాన్ జట్టుతో కొనసాగిన ఈ కేరళ వికెట్ కీపర్ బ్యాటర్.. కెప్టెన్‌గానూ సేవలు అందించాడు. ఐపీఎల్‌లో మొట్టమొదటి విజేత అయిన రాజస్తాన్‌ను.. పద్నాలుగేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తన సారథ్యంలో రెండోసారి ఫైనల్ (2022)కు చేర్చాడు సంజూ. అయితే దురదృష్టవశాత్తూ గుజరాత్ టైటాన్స్‌తో ఫైనల్లో ఓడిపోవడంతో రాజస్తాన్‌తో పాటు కెప్టెన్‌గా కప్పు గెలవాలన్న సంజూ ఆశలకు గండిపడింది.

**యాజమాన్యంతో విభేదాలు**

కాగా గత కొంతకాలంగా సంజూకు.. రాజస్తాన్ జట్టు యాజమాన్యంతో విభేదాలు తలెత్తినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఐపీఎల్-2026 వేలానికి ముందే ట్రేడింగ్ ద్వారా జట్టు మారేందుకు సంజూ నిశ్చయించుకున్నాడనే ప్రచారం తాజాగా జోరందుకుంది. చెన్నై సూపర్ కింగ్స్ సంజూను రాజస్తాన్ నుంచి ట్రేడింగ్ (స్వాప్ డీల్) ద్వారా దక్కించుకోవడం దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. రవీంద్ర జడేజాను రాజస్తాన్‌కు ఇచ్చి.. అందుకు బదులుగా సంజూను సీఎస్‌కే దక్కించుకోనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అదే జరిగితే.. రాజస్తాన్ జట్టుకు కొత్త కెప్టెన్ ఎవరనే చర్చ మొదలైంది.

**రియాన్ పరాగ్ కాదు!**

కాగా సంజూ గైర్హాజరీలో అస్సాం ఆటగాడు రియాన్ పరాగ్ జట్టును ముందుకు నడిపించాడు. ఐపీఎల్-2025లో సంజూ ఫిట్‌నెస్ సమస్యల వల్ల కెప్టెన్సీని దూరంగా ఉండగా.. పరాగ్ సారథిగా ఏమాత్రం ఆకట్టుకోలేకపోయాడు. ఈసారి రాజస్తాన్ మరీ దారుణంగా పద్నాలుగింట కేవలం నాలుగు మాత్రమే గెలిచి తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. ఈ నేపథ్యంలో పరాగ్‌కు కెప్టెన్సీ ఇవ్వకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతుండగా... టీమిండియా నయా సంచలనం ధ్రువ్ జురెల్ పేరు తెర మీదకు వచ్చింది.

**కెప్టెన్సీ రేసులో ఇద్దరు**

రూ. 20 లక్షల కనీస ధరతో రాజస్తాన్ క్యాంపులోకి వచ్చిన జురెల్ అనతికాలంలోనే.. జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. ఈ క్రమంలోనే అతడిని ఫ్రాంఛైజీ రూ. 14 కోట్ల భారీ మొత్తానికి గతేడాది రిటైన్ చేసుకుంది. గత కొంత కాలంగా అతడు సూపర్‌ఫామ్‌లో ఉన్నాడు. టీమిండియాలోనూ కీలక సభ్యుడిగా మారాడు. అంతేకాదు.. అనధికారిక టెస్టు సిరీస్‌లో భారత్- 'ఎ' జట్టు కెప్టెన్‌గా పనిచేసిన అనుభవం కూడా జురెల్‌కు ఉంది. అదే విధంగా.. అండర్-19 స్థాయిలో 2020 వరల్డ్‌కప్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్‌గానూ జురెల్ సేవలు అందించాడు. ఇక యూపీ టీ20 లీగ్‌లో గోరఖ్‌పూర్ లయన్స్ జట్టుకు సారథి కూడా జురెలే! ఈ నేపథ్యంలో పరాగ్‌ను కాదని.. మేనేజ్‌మెంట్ జురెల్ వైపే మొగ్గుచూపుతుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే, మరికొందరు విశ్లేషకులు మాత్రం టీమిండియా స్టార్ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కే రాజస్తాన్ పగ్గాలు అప్పగిస్తారనే విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. కాగా 2020లో రాజస్తాన్ తరఫున అరంగేట్రం చేసిన జైస్వాల్.. ఇప్పటికి 66 మ్యాచ్‌లలో కలిపి 2166 పరుగులు సాధించాడు. ఈ లెఫ్టాండర్ ఖాతాలో రెండు సెంచరీలు కూడా ఉన్నాయి. అయితే, 23 ఏళ్ల జైసూకు ఏ స్థాయిలోనూ కెప్టెన్‌గా పనిచేసిన అనుభవం మాత్రం లేదు. అయితే, అతడి అవకాశాలను మాత్రం కొట్టిపడేయలేము.

**రాయల్స్ కొత్త కెప్టెన్‌గా అతడే!**

రాజస్తాన్ రాయల్స్ కొత్త హెడ్‌కోచ్ కుమార్ సంగక్కర.. జురెల్‌తో పాటు జైస్వాల్ కెప్టెన్సీ రేసులో ఉన్నాడని చెప్పినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం పేర్కొనడం గమనార్హం. అయితే, ఇంపాక్ట్ రూల్ ప్రకారం ఓపెనర్‌గా జైసూకు ప్రత్యామ్నాయం ఉంటుంది. కానీ వికెట్ కీపర్‌గా 24 ఏళ్ల జురెల్ కొనసాగుతాడు! కాబట్టి ప్లేయింగ్ ఎలెవన్‌లో తప్పకుండా ఉంటాడు. అందుకే అతడికే కెప్టెన్సీ చేపట్టే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## ఎవరిపైనా కుట్ర చేయడం లేదు.. డ్రెస్సింగ్ రూమ్‌లో అంతా ఓకే..!




టీ20ల్లో భారత జట్టు బెంచ్ బలం గట్టిగానే ఉన్నా ఆస్ట్రేలియా పర్యటనలో వారిని ఉపయోగించుకోలేదనేది వాస్తవం. వరుసగా విఫలమవుతున్నా సరే వైస్‌కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు, పేసర్ హర్షిత్ రానాకు ఎక్కువ అవకాశాలివ్వడం తీవ్ర దుమారం రేపింది. కోచ్ గౌతం గంభీర్ ఉద్దేశపూర్వకంగానే కొందరికి వంత పాడుతున్నారని, మ్యాచ్ విన్నర్లపై కుట్ర పన్నుతున్నారనే వార్తలు వైరలయ్యాయి. తనను లక్ష్యంగా చేసుకొని వ్యాపిస్తున్న ఈ విమర్శలపై కోచ్ గౌతీ స్పందించాడు. ఆస్ట్రేలియా పర్యటన ముగియడంతో నోరు విప్పిన అతడు.. తాను ఎవరిపైనా కుట్ర పన్నడం లేదని పేర్కొన్నాడు. రాహుల్ ద్రవిడ్ వారసుడిగా భారత కోచ్ పదవికి ఎంపికైన గౌతం గంభీర్ మొదటి నుంచి తన నిర్ణయాలతో వార్తల్లో నిలుస్తున్నాడు. ఆస్ట్రేలియా పర్యటలో తుది జట్టు ఎంపికలో కొందరిపై వివక్ష చూపాడని పలువురు అతడిని దుయ్యబట్టారు. అయితే.. తానేమీ ఉద్దేశపూర్వకంగా కొందరు ఆటగాళ్లను బెంచ్ మీద కూర్చోబెట్టడం లేదని చెబుతున్నాడు గంభీర్. 'స్క్వాడ్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉండడం శుభపరిణామం. వాళ్లలో 11 మందినే ఎంపిక చేయడం చాలా కష్టమైన పని. టీమిండియా కోచ్‌గా నేను ఇప్పుడు ఇదే సంకట పరిస్థితి ఎదుర్కొంటున్నా. నాణ్యమైన ఆటగాళ్లతో మా బెంచ్ బలం కూడా దృఢంగానే ఉంది. ప్రతిఒక్కరు తుది జట్టులో ఆడేందుకు అర్హులే. అయితే.. మ్యాచ్ కోసం పదకొండు మందినే తీసుకోవాల్సి ఉంటుంది. బెస్ట్ కాంబినేషన్ ఆటగాళ్లను ఎంచకోవడం, ఆరోజుకు మ్యాచ్‌ను విజయంతో ముగించడం ఇదే మాకు ముఖ్యం.

# స్పోర్ట్స్

## నా కలల టోర్నీ అదే.. అవకాశమిస్తే రఫ్ఫాడిస్తా..!




టీ20లు అంటేనే చిచ్చరపిడుగుల హవా. ఈ ఫార్మాట్‌లో దంచికొట్టే ఆటగాళ్లు చాలామందే ఉన్నా తానే టాప్ అని చాటుకుంటున్నాడు భారత ఓపెనర్ అభిషేక్ శర్మ ఐపీఎల్ నుంచి ఈ ఏడాది అంతర్జాతీయ మ్యాచ్లలోనూ అదరగొడుతున్న అభి పొట్టి క్రికెట్‌ను ఏలుతున్నాడు. ప్రత్యర్థి ఎవరైనా సరే దంచుడే పరమావధిగా ఆడుతున్న ఈ యంగ్‌స్టర్ నంబర్ 1 ర్యాంక్‌లో తిష్ట వేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన అభిషేక్ తన కలల టోర్నీ కోసం ఎదురుచూస్తున్నాని అంటున్నాడు. ఇంతకు అతడి డ్రీమ్ టోర్నీ ఏంటో తెలుసా..? పొట్టి క్రికెట్‌లో భీకర ఫామ్‌తో బౌలర్లకు దడ పుట్టిస్తున్న అభిషేక్ శర్మ ఓపెనర్‌గా స్థిరపడిపోయాడు. మెరుపు బ్యాటింగ్‌తో శుభారంభాలు ఇస్తూ టీమిండియాకు ప్రధాన అస్త్రంగా మారిన అతడు వరల్డ్ కప్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ కోసం తాను సిద్ధమవుతున్నట్టు చెప్పాడీ సూపర్ స్ట్రయికర్. 'వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ నా కెరీర్లోనే అతిపెద్ద టోర్నీ కానుంది. చెప్పాలంటే అది నా కలల టోర్నమెంట్. నేను వరల్డ్ కప్ కోసం సిద్ధంగా ఉన్నాను. ఒకవేళ నాకు ఈ మెగా ఈవెంట్‌లో ఆడే అవకాశం వస్తే రఫ్ఫాడిస్తా' అని తన మనసులోని మాట చెప్పేశాడీ డాషింగ్ ఓపెనర్. ఆసియా కప్‌లో 314 రన్స్‌తో చెలరేగిన అభిషేక్.. ఆసీస్ గడ్డపై విధ్వంసక ఆటతో రెచ్చిపోయాడు. అభిషేక్ 28 ఇన్నింగ్స్‌లోనే వెయ్యి పరుగుల క్లబ్‌లో చేరాడు. టీ20ల్లో అత్యంత వేగంగా ఈ మైలురాయికి చేరిన భారత క్రికెటర్‌గా అవతరించాడీ లెఫ్ట్ హ్యాండర్. కంగారూలతో జరిగిన ఐదు టీ20ల సిరీస్‌లో 163 పరుగులతో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడీ డేరింగ్ బ్యాటర్. 200ల స్ట్రయిక్ రేటుతో ఆడుతున్న అభి.. ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే వరల్డ్ కప్ ఆడడం పక్కా అంటున్నారు విశ్లేషకులు. ప్రస్తుతం 925 రేటింగ్ పాయింట్స్‌తో అభిషేక్ టీ20ల్లో నంబర్ 1 ఆటగాడిగా కొనసాగుతున్నాడు.

**భారత్‌లో 5, లంకలో 2**

వచ్చే ఏడాది పురుషుల టీ20 ప్రపంచ కప్ పోటీలకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న విషయం తెలిసిందే. పొట్టి ప్రపంచ కప్ బెర్తులు ఖరారు కావడంతో షెడ్యూల్‌పై కసరత్తు చేస్తోంది ఐసీసీ. మొదటగా వేదికల్ని ఖరారు చేయాలి కాబట్టి.. ఆతిథ్య దేశాలైన భారత్‌లో ఐదు, లంకలోని రెండు నగరాలను ఎంపిక చేసింది ఐసీసీ. అహ్మదాబాద్, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, ముంబై.. శ్రీలంకలో కొలంబో, క్యాండీ సిటీల్లో ప్రపంచ కప్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అహ్మదాబాద్‌లోనే మార్చి 8న ఫైనల్ జరుగనుంది.

# ఓటీటీలో రూ.100 కోట్ల సినిమా.. ఈ వారంలోనే డ్యూడ్ స్ట్రీమింగ్



దీపావళికి రిలీజైన అన్ని సినిమాలు ఓటీటీ డేట్ ఇచ్చేశాయి. కిరణ్ అబ్బవరం 'కె-ర్యాంప్' నవంబర్ 15న ఆహాలో రిలీజ్ అవుతున్నట్లు ప్రకటించారు. సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా' మూవీ నవంబర్ 14న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలవుతున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇక దీపావళి రేసులో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'డ్యూడ్' సినిమా ఓటీటీ డేట్ మాత్రం అనౌన్స్ చేయకుండా అభిమానులను సస్పెన్స్‌లో ఉంచారు. ఈ వారమే ఓటీటీలో ఈ సస్పెన్స్‌కు తెర దించుతూ ఎట్టకేలకు డ్యూడ్ ఓటీటీ రిలీజ్ డేట్ ప్రకటించారు. నవంబర్ 14న నెట్‌ఫ్లిక్స్‌లో రానుందంటూ ఎక్స్ వేదికగా పోస్టర్ రిలీజ్ చేశారు. తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో డ్యూడ్ అందుబాటులోకి రానుందని వెల్లడించారు. డ్యూడ్ విషయానికి వస్తే.. ప్రదీప్ రంగనాథన్, మమితా బైజు ప్రధాన పాత్రలు పోషించారు. శరత్‌కుమార్ కీలక పాత్రలో నటించగా కీర్తి శ్వరన్ దర్శకుడిగా పరిచయమయ్యాడు. మైత్రీమూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఈ సినిమా అక్టోబర్ 17న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కాగా ఈజీగా రూ.100 కోట్లు రాబట్టింది. డ్యూడ్ కథేంటంటే.. గగన్ (ప్రదీప్ రంగనాథన్).. ఆముద (నేహా శెట్టి)ని ప్రేమిస్తాడు. కానీ మరొకరిని పెళ్లి చేసుకుంటుంది. గగన్‌ను అతడి మేనమామ (శరత్ కుమార్) కూతురు కుందన (మమిత బైజు) ప్రేమిస్తుంది. కానీ, ఆమె పెళ్లి ప్రపోజల్‌ను గగన్ రిజెక్ట్ చేస్తాడు. కొంతకాలానికి ఆమెనే పెళ్లాడాలనుకున్న టైమ్‌కు కుందన పార్థు (హృదయ్)తో ప్రేమలో ఉంటుంది. అయినప్పటికీ గగన్-కుందనకే పెళ్లి జరుగుతుంది. వీళ్ల పెళ్లికి కారణమేంటి? తర్వాత కలిసున్నారా? లేదా? అనేది ఓటీటీలో చూసేయండి..



## రవితేజ కొత్త మూవీ సంక్రాంతికి రిలీజ్

గత కొన్నేళ్లుగా హీరో రవితేజ సినిమాలైతే చేస్తున్నాడు గానీ హిట్ అనేది లేకుండా పోయింది. వారం పదిరోజుల క్రితం 'మాస్ జాతర' అంటూ వచ్చాడు. యథావిధిగా ఇది కూడా ఫ్లాప్ అయింది. ఇప్పుడు మరో కొత్త మూవీని సిద్ధం చేశాడు. దీనికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే టైటిల్ ఫిక్స్ చేయడంతో పాటు గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. నేను శైలజ, ఉన్నది ఒకటే జిందగీ లాంటి సినిమాలతో ఆకట్టుకున్న కిశోర్ తిరుమల.. రవితేజ కొత్త చిత్రానికి దర్శకుడు. గ్లింప్స్ చూస్తుంటే కామెడీగా బాగానే ఉంది. రామసత్యనారాయణ (రవితేజ)ని అతడి జీవితంలోని ఇద్దరు ఆడోళ్లు రెండు ప్రశ్నలు అడుగుతారు. ఇంతకీ ఆ ప్రశ్నలేంటి? వాటికి ఎవరూ ఎందుకు సమాధానం చెప్పలేకపోయారనేదే స్టోరీలా అనిపిస్తుంది. 'నా జీవితంలోని ఇద్దరు ఆడవాళ్లు రెండు ప్రశ్నలు అడిగారు.. సమాధానం కోసం చాలా ప్రయత్నించారు. గూగుల్, చాట్ జీపీటీ, జెమినీ, ఏఐ.. ఇలా అన్నింటినీ అడిగారు. బహుశా వాటికి పెళ్లి కాకపోవడం వల్ల ఆన్సర్ చెప్పలేకపోయాయేమో' అని రవితేజ చెప్పిన డైలాగ్స్ ఫన్నీగా ఉన్నాయి. ఇందులో ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లు. భీమ్స్ సంగీతమందించాడు. వచ్చే సంక్రాంతికి మూవీని థియేటర్లలో రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. గ్లింప్స్ చూస్తుంటే ఈసారి రవితేజ హిట్ కొడతాడేమో అనిపిస్తుంది.

## క్రిస్మస్‌కి థియేటర్లలోకి 'దండోరా'




కలర్ ఫోటో, బెదురులంక 2012 సినిమాలని నిర్మించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి వస్తున్న లేటెస్ట్ సినిమా 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. ఈ క్రమంలోనే విడుదల తేదీని ప్రకటించారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న మూవీ థియేటర్లలోకి వస్తుందని నిర్మాతలు ప్రకటించారు. అగ్ర వర్ణాలకు చెందిన అమ్మాయిలు ప్రేమించి పెళ్లి చేసుకున్నా, అగ్ర వర్ణాలకు ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతున్నాయనే అంశాన్ని ఆధారంగా చేసుకుని 'దండోరా' సినిమా తీశారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూ దీన్ని తెరకెక్కించారు. శివాజీతో పాటు నవదీప్, బిందు మాధవి తదితరులు నటించారు. బిందుమాధవి ఇందులో వేశ్య పాత్రలో కనిపించనుంది.



# నవంబర్ మూడో వారం "ది రాజా సాబ్" రిలీజ్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న హారర్-కామెడీ "ది రాజా సాబ్" చిత్రం పై అంచనాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమా నుండి ఫస్ట్ సింగిల్ ఎప్పుడు వస్తుందన్న దానిపై అభిమానుల మధ్య పెద్ద చర్చ జరుగుతోంది. దీనిపై చివరికి నిర్మాత ఎస్‌కేఎన్ స్పందించి క్లారిటీ ఇచ్చారు. ఎస్‌కేఎన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఫస్ట్ సింగిల్ విడుదలలో ఆలస్యం రావడానికి కారణం ఉత్తర భారత, తెలుగు మార్కెటింగ్ టీమ్‌ల మధ్య చర్చలు అని చెప్పారు. మొదటగా 'రెబెల్ సాబ్' అనే ఎనర్జిటిక్ సాంగ్‌ను ముందుగా విడుదల చేయాలని అనుకున్నా, ఉత్తర భారత పంపిణీదారులు మాత్రం ముందుగా మెలోడి సాంగ్ రిలీజ్ చేయాలని సూచించారని తెలిపారు. ఈ భిన్నాభిప్రాయాల వల్లే చిన్న ఆలస్యం జరిగిందని అన్నారు. దక్షిణ భారత మార్కెట్లో సాధారణంగా లిరికల్ వీడియోలు మాత్రమే రిలీజ్ చేసి, పూర్తి సాంగ్ వీడియోలను థియేటర్స్‌లో చూపిస్తారని, కానీ ఉత్తర భారత మార్కెట్లో మాత్రం పూర్తి వీడియో సాంగ్స్ ముందుగానే విడుదల చేస్తారని ఎస్‌కేఎన్ వివరించారు. ఇందుకే ఆలస్యం జరిగుతుందని తెలియజేశారు. "ది రాజా సాబ్"లో ఐటెమ్ సాంగ్ ఉండదని, అయితే ఒక పాపులర్ హిందీ సాంగ్‌ను రీమిక్స్ వెర్షన్‌గా తీస్తున్నామని నిర్మాత తెలిపారు. ప్రతి సాంగ్ రిలీజ్ మధ్య 10%-%14 రోజుల గ్యాప్ ఇస్తారని, ఇలా చేయడం వల్ల ప్రేక్షకులు ప్రతి సాంగ్‌ను మంచి మ్యూజిక్ అనుభవంతో ఆస్వాదించగలరని చెప్పారు. ఎస్‌కేఎన్ ప్రకారం, ఫస్ట్ సింగిల్ నవంబర్ మూడో లేదా నాలుగో వారంలో విడుదల కానుంది. ఆ తర్వాత సినిమా ప్రమోషన్లు డిసెంబర్ చివరి వరకు కొనసాగుతాయి. ఈ క్రమంలో "ది రాజా సాబ్" ను 2026 జనవరి 9న, సంక్రాంతి సీజన్‌లో గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి టీమ్ సన్నాహాలు చేస్తోంది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మొత్తానికి, "ది రాజా సాబ్" ఫస్ట్ సింగిల్‌పై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. నిర్మాత ఎస్‌కేఎన్ ఇచ్చిన తాజా అప్‌డేట్‌తో అభిమానులు ఊరట చెందారు. మెలోడి సాంగ్ రూపంలో రాబోయే ఈ ఫస్ట్ సింగిల్, ప్రభాస్ మ్యూజిక్ జర్నీకి కొత్త ఛాప్టర్‌గా నిలిచే అవకాశముంది.



## రొమాంటిక్‌గా శర్వానంద్ బైకర్ లుక్.. లాంచ్ టైం ఫిక్స్

అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ నటిస్తున్న చిత్రం బైకర్ శర్వా36 ప్రాజెక్టుగా వహిస్తున్న ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మీరు బైకర్ స్పీడ్ ఎలా ఉందో చూశారు. ఇక ఇప్పుడు ప్రెప్పీ మెలోడీ టైం వచ్చేసిందంటూ.. ఫస్ట్ సింగిల్ ప్రోమో అప్‌డేట్ లుక్ విడుదల చేశారు. హెల్మెట్ పెట్టుకున్న హీరోయిన్‌తో రొమాంటిక్ మూడ్‌లో ఉన్న శర్వానంద్ స్టిల్ సాంగ్‌పై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ పాట ప్రోమోను నవంబర్ 11న లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు. గిబ్రాన్ మ్యాజికల్ ఆల్బమ్‌ను రెడీ చేస్తున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్.. ఇక్కడ ప్రతీ బైకర్‌కు ఓ కథ ఉంటుంది. సమయంతో పోరాడే కథ.. చావుకు ఎదురెళ్లే కథ.. అంటూ సాగే వాయిస్‌తో ఓవర్‌తో మొదలైన గ్లింప్స్ బైక్ రేసుతో సాగుతుంది. ఏం జరిగినా పట్టువదలని మొండోళ్ల కథ అంటూ బైక్ రేసింగ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. మీ హెల్మెట్లను పట్టుకోండి.. రైడ్ వైల్డ్‌గా ఉండబోతుంది.. గూస్‌బంప్స్ తెప్పించే అడ్వెంచరస్ రైడ్‌కు సిద్ధంగా ఉండండి.. అంటూ శర్వానంద్ టీం ఇప్పటికే బైకర్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేస్తుంది. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో వంశీ కృష్ణారెడ్డి, ఉప్పలపాటి ప్రమోద్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. బైకర్‌లో డాక్టర్ రాజశేఖర్ శర్వానంద్ తండ్రి పాత్రలో కనిపించనుండగా బ్రహ్మాజి, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి గిబ్రాన్ సంగీతం అందిస్తున్నాడు.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108